తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 వెల: 3 సంపుటి:3 సంచిక: 160

బుధవారం 12, నవంబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ



- తిరుగులేని ఆధిక్యంతో కాంగ్రెస్ విజయం
- క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాం
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ధీమా

హైదరాబాద్,నవంబర్ 11(అక్షర గళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో... కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా మిగతా.. 2లో

# 48.47శాతం పోలింగ్..

- 2023 కంటే 1శాతం అధికం
- జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్
- క్యూ లైన్‌లో ఉన్న వారికి ఓటేసే అవకాశం
- షేక్‌పేట డివిజన్‌లో పోలీసుల లాఠీఛార్జి
- పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు
- చివరిదాకా డబ్బులు పంచినా.. గడప దాటని ఓటర్
- 48.47శాతం పోలింగ్.. 2023 కంటే 1శాతం అధికం
- కాంగ్రెస్ కార్యకర్తలు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ పలుచోట్ల బీఆర్ఎస్ నిరసనలు.. లాఠీచార్జి







హైదరాబాద్,నవంబర్11(అక్షర గళం): చెదురుమదురు ఘటనలు, స్వల్ప ఉద్రిక్తతలు మినహా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ పలు ప్రాంతాల్లో రాత్రి 8.30 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్నవారిని తర్వాత కూడా ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు. కడపటి సమాచారం అందే సమయానికి 48.47 శాతం పోలింగ్ నమోదైంది. తుది లెక్కల అనంతరం పోలింగ్ శాతంలో మార్పు ఉంటుందని ఎన్నికల విభాగం వర్గాలు చెబుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 47.58 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి దాదాపు ఒక్క శాతం మాత్రమే పెరిగింది. ఉదయం 9 గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ అనంతరం కాస్త పుంజుకుంది. ప్రధాన పార్టీల కార్యకర్తలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి పోలింగ్‌కు రావాలని కోరడం పలుచోట్ల కనిపించింది. కొన్ని కేంద్రాల్లో మాత్రం నూతన ఓటర్లు, యువత ఓట్లు వేసేందుకు రావడం కనిపించింది. కొన్నిచోట్ల వయోధికులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు తరలి వచ్చారు. వారి కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చెయిర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వలంటీర్లను ఏర్పాటు చేశారు. దాదాపు 100 ఆటోలు ఉచిత సేవలందించాయి. వయోధికులు, దివ్యాంగులను మిగతా.. 2లో



## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

- అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోనూ కాంగ్రెస్‌కే మొగ్గు

హైదరాబాద్,నవంబర్11(అక్షర గళం): తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదనేదానిపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు మిగతా.. 2లో



బాంబు దాడి నిందితులను

## వదలబోం

- భూటాన్ పర్యటనలో ప్రధాని మోడీ హెచ్చరిక
- బాధాతప్ప హృదయంతో ఇక్కడికి వచ్చానని వెల్లడి

న్యూఢిల్లీ,నవంబర్11(అక్షర గళం): ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును మిగతా.. 2లో



## నిందితులను కఠినంగా శిక్షిస్తాం

- దర్యాప్తు సంస్థలు వేగంగా పనిచేస్తున్నాయి
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ,నవంబర్11(అక్షర గళం): ఢిల్లీలోని ఎర్రకోట కారు పేలుడు ఘటనపై కేంద్రరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. పేలుడు ఘటనపై భద్రతా, దర్యాప్తు సంస్థలు సమగ్ర విచారణ చేస్తున్నాయని, నిందితులను కఠినంగా శిక్షిస్తాం అని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాజ్‌నాథ్ సింగ్ హామీ మిగతా.. 2లో

## ఢిల్లీ పేలుడు ఘటనలో 12కు చేరిన మృతుల సంఖ్య

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి
- సిసిటివి దృశ్యాల ఆధారంగా కారు గుర్తింపు



న్యూఢిల్లీ, నవంబర్11(అక్షర గళం): ఢిల్లీ నగరాన్ని కుదిపేసిన ఎర్రకోట పేలుడు ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద జరిగిన ఈ భయానక పేలుడులో తొలుత 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతున్న వారిలో మరో ముగ్గురు ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 12కు చేరింది. ప్రస్తుతం తీవ్ర గాయాలతో 17 మంది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం దిల్లీ ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు. పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం దర్యాప్తు సంస్థలు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇక నిందితుడికి సంబంధించిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కారు నడుపుతోన్న వ్యక్తి డాక్టర్ ఉమర్ మహ్మద్ అని పోలీసులు అనుమానిస్తున్నారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తోన్న ఉగ్ర కుట్రల్లో భాగంగా అరెస్టయిన వారిలోను వైద్యులు ఉండటం కలకలం సృష్టిస్తోంది. ఇప్పటివరకు మంత్రులు, మిగతా.. 2లో

## ఆత్మాహుతి బాంబర్‌గా ఉమర్ గుర్తింపు

- పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరం
- టెర్రరిస్ట్ గ్రూపులో పుల్వామాకు చెందిన వైద్యుడు

న్యూఢిల్లీ,నవంబర్11(అక్షర గళం): దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిన, దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఫరీదాబాద్ ఉగ్ర కుట్రతో సంబంధాలు ఉన్న డా.ఉమర్ మహ్మద్ ఈ పేలుడులో కీలక వ్యక్తి అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. మిగతా.. 2లో







## అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

- పాడెమోసి ప్రేమ చాటుకున్న సిఎం రేవంత్
- హాజరైన పలువురు నేతలు..మంత్రులు..కళకారులు
- పోలీసుల గౌరవ వందనం మధ్య అంత్యక్రియలు పూర్తి
- అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం
- ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా
- పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాసా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,నవంబర్11(అక్షరగళం): అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అందెశ్రీ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిగతా.. 2లో



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టుల మృతి

- మృతుల్లో ఇంద్రావతి నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న.. పాపారావు భార్య ఊర్మిళ?
- తప్పించుకున్న మద్దేడు ఏరియా కమిటీ కమాండ్ పాపారావు?
- తప్పించుకున్న వారికోసం గాలింపు: బస్తర్ ఐజీ సుందర్ రాజ్

బీజాపూర్, నవంబరు 11(అక్షర గళం): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్కు అడవుల్లో మంగళవారం ఉదయం మావోయిస్టులు, కేంద్ర బలగాలకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. నేషనల్‌పార్క్ అటవీ ప్రాంతంలో దాదాపు 25మంది మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారంతో బీజాపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ మిగతా.. 2లో

## బీహార్‌లో ముగిసిన రెండోదశ పోలింగ్

- అత్యధికంగా 67.14శాతం ఓటు హక్కు వినియోగం
- ఓటేసిన దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు
- కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్

పాట్నా,నవంబర్11(అక్షర గళం): బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని ప్రకటించారు. 20 జిల్లాల పరిధిలోని 122 సీట్లకు మంగళవారం పోలింగ్ జరిగింది. ఈ విడతలో 3.7కోట్ల మంది ఓటర్లకు గాను.. పోలింగ్ సమయం ముగిసే మిగతా.. 2లో





## బీహార్‌లో ఎన్‌డిఎకే పట్టం

మరోమారు నితీశ్‌కు బీహారీల ఓటు


అన్ని ఎగ్జిట్ సర్వేల ఫలితాలు ఎన్‌డిఎకు అనుకూలం

పాట్నా,నవంబర్11(అక్షర గళం): దేశంలో అతి పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన బీహర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. దీంతో ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు ఏ పార్టీకి పట్టం కడతాడంటూ దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ ఎన్నికల్లో విజయవకాశాలు ఎన్డీయే కూటమికి ఉన్నాయంటూ పలు సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఈ సర్వేల ఫలితాలు నిజమవుతాయా అనేది తెలియాలంటే.. నవంబర్ 14వ తేదీ వరకు ఆగాల్సి ఉంది. బీహర్ మిగతా.. 2లో

## సునీత వ్యాఖ్యలు సత్యదూరం

- సానుభూతి పొందే ప్రయత్నం
- తిప్పికొట్టిన మంత్రి పొన్నం

హైదరాబాద్,నవంబర్11(అక్షర గళం): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రశాంతంగా కొనసాగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి 40.20 శాతం నమోదయ్యింది. తమను పోలింగ్ స్టేషన్ల దగ్గరకు



రాకుండా అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. ఈ క్రమంలో సునీత వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాజకీయ సానుభూతి ప్రకటనలు కురిపిస్తున్నారని అన్నారు. సునీత వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంగించినట్లేనని అన్నారు పొన్నం. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి మిగతా.. 2లో

# నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతోపాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

(మొదటి పేజీ తరువాయి)

ఇలా ఉన్నాయి. వివిధ సర్వేల ఆధారంగా అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయింది. అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ముందంజలో ఉండగా బిఆర్ఎస్ రెండోస్థానంలో ఉంది. ఇక బిజెపి అతి తక్కువ ఓట్ల శాతంతో మూడో స్థానంలో ఉంది. చాణక్య స్ట్రాటజీస్ కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి 43 శాతం, బిజెపి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే.. కాంగ్రెస్‌కు 48.3శాతం, భారత రాష్ట్ర సమితికి 43.18శాతం, భాజపాకు 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని పేర్కొంది. స్మార్ట్ పోల్ సర్వే .. కాంగ్రెస్‌కు 48.2శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, భాజపాకు 7.6 శాతం, ఇతరులకు 2.1శాతం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది. మొత్తంగా అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ఖూదక్యం కనిపించింది. దీంతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. భారత రాష్ట్ర సమితి తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, భాజపా తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఎన్నికను అధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.

# బాంబు దాడి నిందితులను వదలబోం

(మొదటి పేజీ తరువాయి)

ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లో నూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలిచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోడీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దు:ఖాన్ని అర్థం చేసుకున్నాం. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు సూత్రధారులను విడిచిపెట్టబోం. కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం. ఇప్పటికే ఉగ్ర కుట్ర మూలాలను గుర్తించాం. ఢిల్లీ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాం. పేలుడుపై అర్ధరాత్రి వరకు సమీక్షలు చేస్తూనే ఉన్నాం. బాధితుల వెంట దేశమంతా ఉందని మోడీ తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోడీ మంగళవారం ఉదయం భూటాన్ వెళ్లారు. పర్యటన ముగించుకుని బుధవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5:30 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# నిందితులను కఠినంగా శిక్షస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. ఈ చర్యను శాంతికి భంగం కలిగించే పిరికి ప్రయత్నంగా పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం మీడియా సమావేశంలో రక్షణ శాఖ మంత్రి మాట్లాడారు. 'ఎర్రకోట కారు పేలుడు ఘటనపై దేశంలోని భద్రతా, దర్యాప్తు సంస్థలు సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నాయి. దర్యాప్తు వివరాలు త్వరలోనే వెల్లడిస్తాము. నా దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడుకు బాధ్యులను వదిలిపెట్టం. నిందితులను కఠినంగా శిక్షిస్తాం. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుంది' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీతో సహా పలు ఏజెన్సీలు దర్యాప్తులో భాగం కానున్నాయి. దిల్లీ పేలుడు ఘటనపై దేశంలోని దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని.. త్వరలో ప్రమాదానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. దాడికి కారణమైనవారిని వదిలిపెట్టమని.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఇదిలా ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన మంగళవారం కీలక సమావేశం జరుగుతోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ భేటీ ప్రారంభమైంది. హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్ డీజీపీ, కేంద్ర పాలిత ప్రాంతం ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఢిల్లీ పేలుడిపై ప్రాథమికంగా అందిన సమాచారం, ఉగ్ర సంస్థల ప్రమేయం, భారీ కుట్రపై సమీక్షిస్తున్నారు.

# బీహార్‌లో ముగిసిన రెండోదశ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

సమయానికి అత్యధికంగా 67.14శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి విడతలోనూ రికార్డు స్థాయిలో 65.9శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు 67.14 శాతం పోలింగ్ నమోదు అయింది. కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్ నమోదు అయింది. కతిహార్‌లో 75.23 శాతం, పూర్ణిమలో 73.79 శాతం, సుపౌల్‌లో 70.69 శాతం, పూర్వీ చంపారణ్‌లో 69.31 శాతం పోలింగ్ నమోదు అయింది. కొన్ని ప్రాంతాల్లో అత్యల్ప పోలింగ్ శాతం నమోదు అయింది. నవాడలో 57.11 శాతం, రోహ్తాస్‌లో 60.69 శాతం, మధుబణిలో 61.79 శాతం, అర్వాల్‌లో 63.06 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇక, ఎన్నికలు జరిగిన 122 స్థానాల్లో వివిధ ప్రధాన పార్టీల నేతలతో సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 2000లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 62.57శాతం నమోదు కాగా.. ఇప్పటివరకు ఇదే గరిష్ఠం. లోక్‌సభ ఎన్నికల విషయానికొస్తే.. 1998లో అత్యధికంగా 64.6శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# సునీత వ్యాఖ్యలు సత్యదూరం

(మొదటి పేజీ తరువాయి)

తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు పొన్నం. ప్రజలు తమ ఇష్టానుసారం ఓటు వేసే హక్కు ఉందని.. పోలింగ్ టైంలో స్థానికేతర నేతలు ఉంటే కేసు పెట్టాలని అన్నారు. అయితే.. ఉదయం పోలింగ్ కాస్త నెమ్మదిగా జరిగినా.. గంట గంటకి నెమ్మదిగా ఓటింగ్ శాతం పెరుగుతోంది. మధ్యాహ్నం వచ్చే వరకు పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి వరకు 40.20 శాతం పోలింగ్ నమోదయ్యింది. చివరి రెండు గంటల్లో సాయంత్రం 4 నుంచి 6 వరకు పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారుల అంచనా వేస్తున్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతోంది. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా.. 58 మంది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జూబ్లీహిల్స్ లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు.

# 48.47శాతం పోలింగ్..

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడంతోపాటు తిరిగి ఇళ్ల వద్ద వదిలేశారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సందర్శించారు. పోలింగ్ సరళి, ఏర్పాట్లపై ఆరా తీశారు. డ్రోన్‌ల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో వెబ్ కాస్టింగ్‌ను వీక్షించారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులూ పోలింగ్ సరళిని పరిశీలించారు. 4.01 లక్షల ఓటర్లున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీతా గోపినాథ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. అయితే, పోలింగ్ రోజు పరిణామాలను గమనించినా.. పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ పరిశీలించినా.. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఎన్నికల ఫలితాలు ఈనెల 14వ తేదీన వెలువడనున్నాయి.

**నిరసనలు.. ఉద్రిక్తతలు..**

కాంగ్రెస్ కార్యకర్తలు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ పలు చోట్ల బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో పలు చోట్ల పోలీసులు లాఠీచార్జీ చేశారు. పలువురిని అరెస్టు చేశారు. యూసుఫగూడలోని మహ్మద్ ఫంక్షన్ హాల్‌లో బయటి వ్యక్తులు ఉన్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో కౌశిక్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఇరు వర్గాలను చెదరగొట్టారు. షేక్‌పేట అల్ ఫరాహ్ స్కూల్లోని 66, 67 నంబరు పోలింగ్ కేంద్రాల్లో బూత్ ఏజెంట్లను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఎర్రగడ్డ డివిజన్ డాన్ బాస్కో స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ ఏజెంట్లను బెదిరించి కొందరు రిగ్గింగ్ చేశారని, రీ పోలింగ్ నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. షేక్‌పేట అపెక్స్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలు 4, 5, 6, 7, 8లో రిగ్గింగ్ చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు నిరసన తెలపగా.. పోలీసులు లాఠీచార్జ్ చేసి వారిని పంపించేశారు. కృష్ణానగర్‌లోని ఓ



పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓట్లు వేస్తున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆందోళన చేశారు. అంతకుముందు ఓ పోలింగ్ బూత్ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థిని లోనికి వెళ్లనివ్వరా..? అంటూ ఆమె వారితో వాగ్వాదానికి దిగారు. అలాగే, పోలింగ్ రోజు జూబ్లీహిల్స్ పరిధిలో ఉన్నారంటూ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రాంచందర్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, డాక్టర్ మెతుకు ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తాను జూబ్లీహిల్స్‌లో లేనని, అయినా తనపై కేసు నమోదు చేశారని ఆనంద్ ఆరోపించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెంకటగిరి ఆల్ఫాన్సా స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఓటు వేశారు. కృష్ణదేవరాయనగర్ పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీనగర్ కాలనీ శాలివాహనగ ర్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఓటు వేశారు.




షేక్‌పేట ఇంటర్నేషనల్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో దర్శకుడు రాజమౌళి, మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి స్కూల్ పోలింగ్ కేంద్రంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, శ్రీనగర్‌కాలనీ మహిళా సమాజం పోలింగ్ కేంద్రంలో సినీ నటుడు గోపీచంద్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, యూసుఫగూడ ప్రభుత్వ పాఠశాలలో నటుడు తనికె ళ్ల భరణి ఓటు వేశారు. మధురానగర్‌లో ఐఏఎస్ బెన్హర్ దత్, ఐపీఎస్ స్వాతి లక్రా, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, వెంగళ్‌రావు నగర్‌లో సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

బలగాలు మంగళవారం సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో మోస్ట్ వాంటెడ్, మద్దేడు ఏరియా కమిటీ కమాండర్ పాపారావు భార్య ఊర్మిళ, నేషనల్ పార్కు ఏరియా కమిటీ ఇన్‌చార్జి బుచ్చన్న ఉన్నట్లు తెలుస్తోంది. ఊర్మిళ మద్దేడు ఏరియా కమిటీ సభ్యురాలుగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనలో పాపారావు తప్పించుకొన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌తో దక్షిణ బస్తర్ ప్రాతంలోని నేషనల్ పార్క్ పరిధిలో ఉన్న ఎయిడెడ్ కమిటీ దాదాపుగా తుడుచుపెట్టుకుపోయిందని పోలీసులుచెబుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల్లో ముగ్గురు మహిళలున్నారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి పలు తుపాకులు, స్టెన్‌గన్, ఇన్సాస్ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను పంపించామని, కూంబింగ్ ముగిసిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఆశన్నతో కలిసి పలువురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరంతా నేషనల్ పార్కు అడవుల నుంచి వచ్చారు. వారిచ్చిన సమాచారం ఆధారంగానే బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు, బీజాపూర్ జిల్లా తార్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నారం అడవుల్లోనూ మంగళవారం మావోయిస్టులు, పోలీసు బలగాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. గాయాలతో పలువురు మావోయిస్టులు బలగాలకు పట్టుబడ్డట్లు సమాచారం.

## హిడ్మా కోసం వేల బలగాలు

మార్చి 31కల్లా మావోయిస్టు పార్టీని నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌కు గడువు ఇంకా 5 నెలలు మాత్రమే మిగిలి ఉంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా జాడను పోలీసులు ఇంతవరకు కనుక్కోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే తాజాగా వేల మంది బలగాలను రంగంలోకి దింపారు. పామేడు, అబూజ్‌మడ్, నేషనల్ పార్కు, కర్రెగుట్టల్లో గాలింపు ముమ్మరం చేశారు. హిడ్మా లొంగి పోవాలని, హిడ్మా ఇంటికెళ్లి ఛత్తీసగఢ్ హోంమంత్రి విజయశర్మ ఇటీవలే కోరారు. అడవుల్లో ఇంకా సాయుధ పోరాటం చేస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు గణపతి, బెహరా, పశులూరి విశ్వనాథం, కాకా హనుమంతు, మల్లా రాజిరెడ్డి, అనల్‌ధా, రణదేవ్, గోసం గాలింపు ముమ్మరం చేశారు. ప్రత్యేక శాటిలైట్ చిత్రాల ద్వారా వారి జాడను కనుగొంటున్నారు.

# బీహార్‌లో ఎన్‌డిఎకే పట్టం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 67 శాతానికిపైగా ఓటింగ్ నమోదు అయినట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల వేళ.. ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. దీంతో ఎన్డీయే కూటమి, మహాఘట్‌బంధన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు బీహర్‌లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. అలాగే లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం ఆ రాష్ట్రంలో ఇటీవల యాత్ర చేపట్టారు. బిహార్‌లో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరు ముగియడతో ఎగ్జిట్ పోల్ అంచనాలు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఆయా సర్వేలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెల్లడించాయి. వీటిలో ఎక్కువగా అధికార 'ఎన్డీయే'కు బిహారీలు మరోసారి పట్టం కట్టనున్నట్లు పేర్కొన్నాయి. అధికార పక్షానికి మెజార్టీ మార్కు 122 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని దాదాపు అన్ని సర్వేలు అంచనాకు వచ్చాయి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ అంతగా ప్రభావం చూపలేదని తెలిపాయి. బిహార్‌లో అధికార ఎన్డీయే 133–159 స్థానాల్లో విజయం సాధిస్తుందని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహాగఠ్‌బంధన్‌కు 75–101 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీకి 0–5 స్థానాలు, ఇతరులు 2–8 స్థానాల్లో విజయం సాధించవచ్చని అంచనా వేసింది. దైనిక్ భాస్కర్ ఎన్డీయేకు 145–160 సీట్లు, మహాగఠ్‌బంధన్‌కు 73–91 సీట్లు రావచ్చని అంచనా వేసింది. ఎన్డీయేకు 147–167, విపక్షాలకు 70–90 స్థానాలు ఇతరులకు 2–8 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ కూడా ఎన్డీయేకు 133–148, విపక్షాలకు 87–102 సీట్లు, ఇతరులకు 3–6 వస్తాయని పేర్కొంది. జన్‌సురాజ్ పార్టీకి మాత్రం 0–2 స్థానాల్లో గెలుపొందే అవకాశం ఉందని తెలిపాయి. మొత్తంగా బీజేపీ సారథ్యంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి ప్రధాన ఎగ్జిట్ పోల్ సర్వేలు పట్టం కట్టాయి. ఎన్డీయే కూటమి తిరిగి అధికారంలోకి రాబోతోందని తెలిపాయి. మెజారిటీకి 122 సీట్లు అవసరం కాగా, ఈ నాలుగు సర్వేల్లోనూ ఎన్డీయే దూసుకుపోయింది. జేవీసీ ఎగ్జిట్ పోల్ అంచనా ప్రకారం ఎన్డీయే 135 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. ఇండియా కూటమికి 83 నుంచి 103 సీట్లు వస్తాయి. డీవీసీ రీసెర్చ్ పోల్స్ సర్వే ప్రకారం ఎన్డీయే 137 నుంచి 152 సీట్లు గెలుచుకుంటుంది. మహాగఠ్‌బంధన్ 83 నుంచి 98 సీట్లు, జన్‌సూరాజ్ 2 నుంచి 4, ఇతరులు 4 నుంచి 8 సీట్లు గెలుచుకుంటారని తెలిపింది. చాణక్య సర్వే ప్రకారం ఎన్డీయే 130 నుంచి 138 సీట్లు గెలుచు కుంటుంది. ఎంజీబీ 100 నుంచి 108, ఇతరులకు 3 నుంచి 5 సీట్లు వస్తాయి. టైమ్స్ నౌ సర్వే ప్రకారం ఎన్డీయే 129 సీట్లు గెలుచుకుంటుంది. ఎంజీబీ 86 సీట్లు, జేఎస్‌పీ 2 సీట్లు, ఇతరులు 3 సీట్లు దక్కిచుకుంటారు.

# ఢిల్లీ పేలుడు ఘటనలో 12కు చేరిన మృతుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు దీనిని ఉగ్ర ఘటనగా పేర్కొన్నప్పటికీ.. చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు. అయితే భయంతో ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడా..? అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న 8 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. వీరిలో ముగ్గురు వైద్యులు అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఉన్నారు. వారిలోని మహిళా డాక్టర్ షాహిన్ సోమవారం లఖ్‌నవూలో అరెస్టు కాగా ఆమె కారు నుంచి ఏకే–47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. మరోపక్క గుజరాత్‌లో భారీ ఉగ్ర కుట్రకు ప్రయత్నించిన సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌తో పాటు మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ కూడా ఒక డాక్టర్ కావడం గమనార్హం. ఈ పరిణామాల వేళ ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తన సహచరుల అరెస్ట్, బాంబు తయారీలో వాడే పేలుడు పదార్థాల స్వాధీనంతో నిరాశ చెందిన అతడు ఈ పేలుడు పాల్పడి ఉండొచ్చన్న కోణాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. పేలుడుకు పాల్పడినట్టు అనుమానిస్తున్న డాక్టర్ ఉమర్ మహమ్మద్ కుటుంబ సభ్యులు సహా ఆరుగురిని జమ్మూ కాశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఉమర్ తల్లి షమీనా భానో, సోదరులు ఆషిక్ అహ్మద్, జాహ్ అహ్మద్, అలాగే ప్లంబర్ అమిర్ రషీద్, ప్రభుత్వ ఉద్యోగి అమిర్ రషీద్ మిర్, బ్యాంకు సెక్యూరిటీ గార్డ్ తారిఖ్ మాలిక్ ఉన్నారు. పోలీసుల సమాచారం ప్రకారం ఫరీదాబాద్ ఆయుధాల కేసులో పరారీలో ఉన్న ఉమర్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉండి, ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండవచ్చుని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీల ద్వారా కారు కదలికలను పోలీసులు గుర్తించారు.

# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా అప్పుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తి శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశ్వత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు.

# ఆత్మాహుతి బాంబర్‌గా ఉమర్ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

పుల్వామాకు చెందిన ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. అతడి తండ్రి జీహెచ్ నబీ భట్, తల్లి షమీమా బానో. ఉమర్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి.. దాదాపు 10 ఏళ్ల క్రితం ఉద్యోగం నుంచి వైదొలిగారు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉమర్ ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశాడు. కొన్నాళ్లు.. జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా ఉన్నాడు. అనంతరం ఫరీదాబాద్ లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. సోషల్ మీడియా వేదికగా తీవ్రవాద భావజాలానికి గురైన డాక్టర్లలో ఉమర్ కూడా ఒకడు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఉగ్రవాద ఆపరేషన్‌లో పలువురు డాక్టర్లను భద్రతాధికారులు అరెస్టు చేశారు. వారితో ఉమర్‌కు కూడా సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అరెస్టయిన డా.అదిల్‌కు ఉమర్ సన్నిహితుడు అని, గతంలో వీరిద్దరూ అనంత్‌నాగ్‌లో కలిసి పనిచేసినట్లు కనుగొన్నారు. వారి అరెస్టు నేపథ్యంలో భయాందోళనకు గురైన ఉమర్..ఈ పేలుడుకు పాల్పడినట్లు నిఘా వర్గాలు అనుమాని స్తున్నాయి. ఇక, తాజా పేలుడు నేపథ్యంలో ఉమర్ కుటుంబ సభ్యులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడి సోదరులు జహూర్, ఆషిక్ నబీలను కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉమర్ తన తల్లికి ఫోన్ చేసి.. లైబ్రరీలో చదువుకోవడంలో బిజీగా ఉన్నందున తనకు ఫోన్ చేయొద్దని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన ఫోన్‌ను కూడా స్విచ్ ఆఫ్ చేశాడు. పేలుడుకు కారణమైన కారులో ఓ వ్యక్తి శరీర భాగాలను అధికారులు గుర్తించారు. ఇవి ఉమర్‌వా, కావా అని తెలుసుకునేందుకు అతడి కుటుంసభ్యుల నుంచి డీఎన్‌ఏ నమూనాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దిల్లీ పేలుడులో ఉమర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వారు తారిఖ్ అహ్మద్ మాలిక్, ఆమీర్ రషీద్, ఉమర్ రషీద్‌గా గుర్తించారు. ఈ క్రమంలో ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డా.ఉమర్ మహమ్మద్ ముఖచిత్రం బయటపడింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో పేలిన వైట్ హ్యుందాయ్ ఐ20కారు ఉమర్‌కు చెందినదిగా పోలీసులు తేల్చారు. ఈ దుర్ఘటనలో 12 మంది మరణించగా, 20 మంది క్షతగాత్రులయ్యారు. దీనిని ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న పోలీసులు.. అతడి ముఖాన్ని యాక్సెస్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జమ్ము కశ్మీర్ అతడి తల్లి, సోదరులను దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. జమ్ము కశ్మీర్, హరియాణా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో సోమవారం అరెస్టైన ఇద్దరు వైద్యులు అదిల్ అహ్మద్ రాథర్, ముజామ్మిల్ షకీల్‌లతో ఇతడికి సాన్నిహిత్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని రోజులుగా మాడ్యూల్‌లో ఉన్న ఆ ఇద్దరు కీలక సభ్యులను అరెస్ట్ చేసిన దర్యాప్తు బృందం.. వారి నుంచి సుమారు 2,900 కిలోల అనుమానిత పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుంది. విషయం తెలుసుకున్న ఉమర్.. ఫరీదాబాద్ నుంచి పరారయ్యాడు. అతడు భయాలోందనకు గురై ఇలా ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడినట్టు సమాచారం. ఈ దాడి చేసేందుకు ఉమర్, అతడి సన్నిహితులు అమ్మోనియం నైట్రేట్ ఇంధన ఆయిన్‌ను వినియోగించారు. కారులో డిటోనేటర్‌ను ఉంచి లాల్‌ఖిలా సమీపంలో రద్దీగా ఉండే ప్రదేశంలో ఈ ఉగ్రదాడికి పాల్పడ్డారు. ఎర్రకోట సమీపంలో పేలిన హ్యుండాయ్ ఐ20 వాహనం.. బాదర్‌పూర్ సరిహద్దు నుంజి ఢిల్లీలోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలలో నిక్షిప్తమయ్యాయి. ఆ కారును.. ఔటర్‌రింగ్ రోడ్ నుంచి మధ్యాహ్నం గం.3:19ల ప్రాంతంలో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పార్క్ చేశారు. ఆ తర్వాత మూడు గంటల అనంతరం సాయంత్రం గం.6:30లకు అక్కడి నుంచి బయల్దేరిందని అధికార వర్గాలు తెలిపాయి. అనుమానిత ఆత్మాహుతి దళ సభ్యుడు ఒక్క నిమిషం కూడా ఆ కారును వదిలివెళ్లలేదని పేర్కొన్నాయి. తొలుత ఆ కారును గురుగ్రామ్‌కు చెందిన సల్మాన్ అనే వ్యక్తి 2025 మార్చిలో ఓఖ్లాలోని దేవేందర్‌కు అమ్మాడు. ఆ తర్వాత దేవేందర్ దానిని అంబాలా వాసికి విక్రయించాడు. ఆ వ్యక్తి నుంచి అమిర్‌కు, ఆపై తారిఖ్, ఉమర్‌లకు చేతులు మారి పుల్వామాకు చేరింది. అక్కడ అమిర్, తారిఖ్, రశీద్‌ల మధ్య సంబంధాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో అమిర్, తారిఖ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు ఢిల్లీ పోలీసులు. ఫరీదాబాద్ నుంచి ఇటీవల అనేక మంది వైద్యులు అరెస్ట్ కాగా.. వారు ఉగ్రవాద దాడికి ప్లాన్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీరిలో అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల(జీఎంసీ) వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ ఒకడు. అతడు.. శ్రీనగర్‌లోని జైష్–ఎ–మహమ్మద్ ఉగ్రసంస్థకు మద్దతుగా పోస్టర్లు వేస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్న పోలీసులు.. ఈనెల 6న ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఓ ఆసుపత్రిలో అరెస్ట్ చేశారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

# ప్రశాంత వాతావరణంలో ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

### కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేసిన బండి రమేష్



**కూకట్పల్లి, నవంబర్ 11 (అక్షర గళం):** టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని వెంగళరావునగర్ మధుర నగర్ లలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. జరిగిన ఉప ఎన్నిక ఓటింగ్ సరళి ఆయన పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో ఆయన మాట్లాడారు ఓటింగ్ సమయంలో ఏమన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నారా అంటూ వారిని ప్రశ్నించారు.పార్టీ కార్యకర్తలకు ఓటు వేసే విషయంలో అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు.పార్టీకి చెందిన ఓట్ల తో పాటు తటస్థ ఓట్లను పార్టీకి పడేలా చూడాల్సిందిగా కార్యకర్తలకు ఆయన సూచించారు. మొత్తం మీద ఉపఎన్నిక సజావుగా, శాంతియుత వాతావరణంలో ముగిసేలా పార్టీ కార్యకర్తలు కృషి చేసినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, కృష్ణ రాజపూత్ ,ప్రకాష్, అస్లాం ,రాజు తదితరులు ఉన్నారు.



# చలి మొదలైంది

### - రెండు రోజులుగా తగ్గుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు


**ఆమనగల్లు, నవంబర్ 11 (అక్షర గళం):**
జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. ఈ నెల ప్రారంభం నుంచే చలికాలం మొదలు కావాల్సి ఉన్నా.. మొంథా తుపాను కారణంగా వర్షాలు కురిసి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడంతో మొన్నటి వరకు చలి తీవ్రత ప్రారంభం కాలేదు. తుపాను ప్రభావం తగ్గడంతో ప్రస్తుతం రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. రెండు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు పడిపోతున్నాయి. దీంతో జిల్లా అంతటా చలితీవ్రత పెరిగింది. సోమవారం పగటి ఉష్ణోగ్రత కూడా 28 డిగ్రీలకు తగ్గింది. మరో రెండు మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుంది. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రోగులు, దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడుతున్న వారు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

#### ఉన్ని దుస్తులకు గిరాకీ..

చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో పలు ప్రాంతాల్లో వెలసిన ఉన్ని దుస్తుల దుకాణాలకు గిరాకీ పెరిగింది. చలి నుంచి ఉపశమనం పొందడానికి స్వెట్టర్లు, మంకీ క్యాప్లు, టోపీలు తదితర ఉన్ని దుస్తులను కొనడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆదర్శనీయుడు

**ఆమనగల్లు, నవంబర్ 11 (అక్షర గళం):**
భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆదర్శనీయుడని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన మహనీయుడని మాజీ కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా అన్నారు. మంగళవారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం జహంగీర్ బాబా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమ



యంలో ఆజాద్ పోరాట స్ఫూర్తి వెలకట్టలేనిదని అన్నారు. తన దూరదృష్టితో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ఆయన చేసిన కృషి అనిర్వచనీయం అన్నారు. భారతదేశంలో విద్యాబివృద్ధికి మౌలానా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగాళ్ల లక్ష్మయ్య, నాయకులు అస్గర్ అలీ, భరత్ యాదవ్, భాను కిరణ్, తుప్పరి మహేష్, మోత్యా నాయక్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సారా తయారీ ముడిసరుకు పట్టివేత

**ఆమనగల్లు, నవంబర్ 11 (అక్షర గళం):**
సారా తయారీ కోసం ముడి పదార్థాలను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహన్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుండి వివిధ గ్రామాలకు సారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం, పట్టిక వంటి ముడి పదార్థాలను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం



రావడంతో, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహన్ సిబ్బందితో కలిసి కడ్తాల్ టోల్గా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ వాహనంలో 120 కిలోల నల్ల బెల్లం, 120 కిలోల పట్టిక లభించాయని సీఐ తెలిపారు. ఈ ఘటనలో నిందితులు ప్రవీణ్, బిచ్చ లను అరెస్టు చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ముడి పదార్థాలతో పాటు 2 మొబైల్ ఫోన్ లు, ఆటో రిక్షాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్, సిబ్బంది శంకర్ బాబు, శ్రీను, ఆమని తదితరులు ఉన్నారు.

# బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్

### సిట్ విచారణకు హాజరైన విజయ్ దేవర కొండ

**హైదరాబాద్,నవంబర్11(అక్షర గళం):** బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ కేసులో నటుడు విజయ్‌దేవరకొండ సీఐడీ సిట్ విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విజయ్ దేవరకొండను గంటకుపైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమిషన్లపై ఆరా తీసినట్టు సమాచారం. విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం వెనుకగేటు నుంచి విజయ్ దేవరకొండ వెళ్లిపోయారు. విచారణకు హాజరు కావాలని విజయ్ దేవరకొండతో పాటు నటుడు ప్రకాశ్‌రాజ్‌కు కూడా సీఐడీ సిట్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.





# రచయిత అందెశ్రీ కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా తనకు తీరని లోటు

### తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**మేడ్చల్ ప్రతినిధి, నవంబర్ 11, (అక్షర గళం):**
రచయిత అందెశ్రీ కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా తనకు తీరని లోటని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" రచయిత అందెశ్రీ అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పోలీసు గౌరవ వందనంతో లాంఛనంగా ఘట్కేసర్ లోని ఎంఎల్ఎ క్యాంపు ఆఫీస్ ప్రక్కన ఉన్న స్మృతి వనంలో నిర్వహించారు.ఈ సందర్భంగా అందెశ్రీ పాడెను ముఖ్యమంత్రి మోసారు. సంప్రదాయ పద్దతిలో అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుదిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వద్దూరి లక్ష్మణ్, ఎంఎల్ఎ మల్లారెడ్డి లతో పాటు ప్రముఖులు హాజరై అందెశ్రీకి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అందెశ్రీ పశువుల కాపరిగా, తాపీ మేస్త్రిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన వ్యక్తి



అని అన్నారు. ఆయన రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపింది అందుకే ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.ఆయన పాటల సంకలనం "నిప్పుల వాగు" ఒక భగవద్గీతగా, బైబిల్ గా, ఖురాన్ గా తెలంగాణ సమస్యలపై పోరాడేవారికి గైడ్ గా ఉపయోగ పడుతుందని తెలిపారు. 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీ లో అందుబాటులో ఉంచుతామన్నారు. అందెశ్రీ కి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని, ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని వారికి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు సహకరించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వారిని పద్మశ్రీ తో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అందెశ్రీ అంత్యక్రియలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాయంత్రాంగం భారీగా ఏర్పాట్లు నిర్వహించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఘట్కేసర్ తహసీల్దారు, మున్సిపల్ కమీషనర్,అర్ అండ్ బిఈఈ శ్రీనివాస్, రాష్ట్రవ్యాప్తంగా సాంస్కృతిక సారధి కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.


# జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో గంజాయి నిర్మూలన కోసం కలిసి పని చేద్దాం

### గంజాయి నిర్మూలనకు గళమెత్తిన జగద్గిరిగుట్ట వాసులు

**కుత్బుల్లాపూర్, నవంబర్ 11, (అక్షర గళం):**
జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో గంజాయి నిర్మూలన కోసం కలిసి పని చేద్దామని జగద్గిరిగుట్ట అన్ని బస్తిల కమిటీల నాయకులు అన్నారు. మంగళవారం గంజాయిలేని సమాజం నిర్మిద్దామని జగద్గిరిగుట్ట కార్యాలయంలో జరిగిన సమావేశంలో జగదీగుట్ట అన్ని బస్తిల గంజాయి లేని సమాజం నిర్మిద్దామని జగద్గిరిగుట్ట కార్యాలయంలో జరిగిన సమావేశంలో జగద్గిరిగుట్ట అన్ని బస్తిల కమిటీల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై గంజాయికి వ్యతిరేకంగా కలిసి పోరాటం చేద్దామని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్టలో గంజాయి అమ్మలనుకునే వారికి, సేవించాలనుకునే వారికి జగద్గిరిగుట్టలో కిరాయిలకు ఇవ్వద్దని, ఒకసారి గంజాయి కేసులో పట్టుబడితే జగద్గిరిగుట్ట నుండి బహిష్కరించాలన్నారు. అన్ని బస్తీలలో గంజాయి వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి బస్తీ ప్రజలను చైతన్యవంతం చేయాలని జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బస్తీ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్టలో మానవహారాన్ని వేలాది మందితో ఏర్పాటు చేయాలని ఇది ఆరంభం మాత్రమేనని రానున్న రోజుల్లో గంజాయి



రహిత సమాజం నిర్మించడం కోసం ప్రజలంతా ఏకం కావాలని గంజాయి వ్యతిరేక కమిటీ నిర్ణయించడం జరిగింది.ఈ సమావేశంలో నాయకులను ప్రవీణ్ ఆహ్వానించగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన సీనియర్ నాయకుడు యేసు రత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శిలు హరినాథ్, రాములు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గణేష్, యువజన నాయకులు సాయి పంతుల, పవన్ రెడ్డి, జనసేన సతీష్, బిజెపిహనుమంతు చారి, రాజు యాదవ్, ప్రజానాట్య మండలి బాబు,ఏఐటీయూసీ శ్రీనివాస్, దుర్గయ్య, సదానంద, శ్రీనివాస్ నగర్ ఖయ్యూం,సీనియర్ జర్నలిస్ట్ తొండ వెంకట్, లెనిన్ నగర్ సదానందం, వనం రాజు, జీవి శ్రీనివాస్,రవీందర్ గౌడ్, మైసమ్మ నగర్ బసప్ప, రవి, రవీందర్ రెడ్డి, బ్రహ్మానంద చారి,కృష్ణ గుడ్ మార్నింగ్ మురళి, సూరారం కాలనీ అధ్యక్షుడు సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రివేణి, విశ్వబ్రాహ్మణ సంఘం మనోహర్ చారి, దిన బందు కాలనీ ప్రవీణ్, అంజయ్య నగర్ వెంకటేష్, హెల్పింగ్ హాట్స్ హెల్పింగ్ హార్ట్స్ విజయ్, రాజు, ఇమామ్, నరసింహ, సామిల్, నరసింహారెడ్డి, శ్రీనివాస్, సుంకిరెడ్డి ,అన్ని బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి

**జూబ్లీహిల్స్ , నవంబర్ 11, (అక్షర గళం):**
ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ సరళిని ఆయన పకడ్బందీగా పర్యవేక్షించారు. మంగళవారం సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని శాస్త్రి నగర్, బంజారా నగర్, ఛత్రపతి శివాజీ నగర్, ఓల్డ్ సుల్తాన్పూర్, ప్రేమ్ నగర్ లలో ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా సైబరాబాద్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాల వద్దకు అమర్చిన 19 సీసీటీవీల ద్వారా రియల్ టైమ్ లొకేషన్ వ్యవస్థతో ఎప్పటికప్పుడు పోలింగ్ సరళి



పనితీరును సీపీ మొహంతి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సీపీ మొహంతి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని అన్నారు. ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, సిబ్బంది డిప్లాయ్ మెంట్, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అన్ని అంశాలపై కృషి చేసిన సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్‌లో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను సీపీ ఆదేశించారు. నివాసాలలో, హోటళ్లు, లాడ్జీలలో స్థానికేతరులు బస చేయకుండా చూడాలన్నారు. అధికారులతో మాట్లాడుతూ సీపీ మొహంతి పలు అంశాల గురించి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకునేలా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోసం భద్రత కల్పించాలని ఉద్ఘాటించారు. ఈ విధమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ పర్యవేక్షణలో సీపీ అవినాష్ మొహంతి వెంట బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి, అడిషనల్ డీసీపీ (ఎస్బి) రవి కుమార్, బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, సనత్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# రాచూర్ వింటేజ్ కాఫీకంపెనీపై చర్య తీసుకోవాలని రైతులు నిరసన

**వెల్దండ నవంబర్ 11 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామంలోని వింటేజ్ కాఫీకంపెనీ వ్యర్థపు నీరుతో కంపెనీ సమీప పొలాల పంటలకు నష్టం కలుగుతుందని వింటేజ్ కాఫీకంపెనీ రోడ్డుపై మంగళవారం రైతులు రాచూర్ గ్రామస్తులతో కలిసి నిరసన చేపట్టారు వింటేజ్ కాఫీ కంపెనీ నుండి వెలువడే వ్యర్థపు నీటితో పొలాలు దెబ్బతింటున్నాయని పంటలు పండడం లేదని పంటలు సరిగా పండడం లేదని పండిన పంటలు రంగులుగా మారి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే అధికారులు ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు న్యాయం చేయాలని గ్రామస్తులు రైతులు డిమాండ్ చేశారు

# దళారులను నమ్మి మోసపోవద్దు

**- సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్**

**- నేడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**ఆమనగల్లు, నవంబర్ 11 (అక్షర గళం):** రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సింగల్ విండో కార్యాలయంలో వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు ఆవరణలో సింగల్ విండో



సమావేశంలో మాట్లాడుతున్న గంప వెంకటేష్

ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి లతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతులు మీదుగా ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని వరికి క్వింటాలుకు మద్దతు ధర రూ. 2369 పైసలు మరియు సన్న రకం వడ్లకు రూ. 5, వందల బోనస్ ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక, మండల ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, వ్యవసాయ అధికారులు సరియగు సమయానికి హాజరు కావాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు. ఈ సమావేశంలో సింగల్ విండో వైస్ చైర్మన్ డి. సత్యం, సింగల్ విండో సీఈఓ గోరటి దేవేందర్ పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కలామ్ ఎనలేని కృషి

**ఆమనగల్లు, నవంబర్ 11 (అక్షర గళం):** భారత తొలి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలామ్ ఆజాద్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని మండల జేఏసీ అధ్యక్షులు అవ్వారి శివలింగం, కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు బాబా అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అబుల్ కలామ్ ఆజాద్ విద్యాభివృద్ధికి వేసిన బాటలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని



తెలిపారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆజాద్ పోరాట స్ఫూర్తి వెలకట్టలేనిదని అన్నారు. తన దూరదృష్టితో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ఆయన చేసిన కృషి అనిర్వచనీయం అన్నారు. భారతదేశంలో విద్యాబివృద్ధికి మౌలానా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, నాయకులు అబ్దుల్ కరీం, సంచార జాతి రాష్ట్ర కార్యదర్శి పూసల రమేష్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూదిని కొండల్ రెడ్డి, కండె సాయి, పెయింటింగ్ సంఘం అధ్యక్షుడు మహేష్, అబ్దుల్ కలీమ్, ఇమ్రాన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 14 వరకు నేరుగా హాజరు కావాల్సిందే

**జగన్‌కు సిబిఐ కోర్టు ఆదేశం**

**హైదరాబాద్,నవంబర్ 11(అక్షర గళం):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న పిటిషన్‌పై హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ అభ్యర్థనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. దీంతో వ్యక్తి గత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న మోమోను జగన్ తరఫు న్యాయవాది వెనిక్కి తీసుకున్నారు. కొంత సమయం ఇస్తే వ్యక్తిగతంగా విచారణకు హాజరవుతారని చెప్పారు. ఇందుకోసం వారం రోజులు సమయం ఇవ్వాలని జగన్ తరఫు




న్యాయవాది కోరగా.. ఈనెల 21 వరకు న్యాయస్థానం సమయం ఇచ్చింది. యూరప్ పర్యటనకు వెళితే ఈ నెల 14వరకు కోర్టుకు హాజరు కావాలని గతంలోనే సీబీఐ కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.





# జేఎన్టీయూహెచ్ జేఏసీ చైర్మన్ & రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల మహానాడు మంద రంజిత్ కుమార్‌కి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం

**కూకట్పల్లి నవంబర్ 11 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్రంలోని అగ్ర సాంకేతిక విద్యాసంస్థ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ (జేఎన్టీ యూహెచ్) నుండి ఎనర్జీ సిస్టమ్స్ విభాగంలో డాక్టరేట్ డిగ్రీను మంద రంజిత్ కుమార్ 2025 నవంబర్ 11న పొందడం గర్వకారణం (డిజైన్ అండ్ ఎనాలిసిస్ అఫ్ ఎస్ పి వి సిస్టంస్ ఫర్ హయ్యర్ ఎలక్ట్రికల్ ఔటపుట్ విత్ డిఫరెంట్ ఎంపీపీటీ టెక్నిక్యూస్) అనే అంశంపై ఆయన విలువైన పరిశోధన చేశారు. ఈ పరిశోధనను విశ్వవిద్యాలయ రెక్టర్ డా. కె. విజయ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తి చేశారు మంద రంజిత్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలురుపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాల లో ప్రాథమిక విద్యనభ్యసించి, 10వ తరగతిలో మండలంలో రెండవ ర్యాంక్ సాధించారు

తరువాత కొత్తగూడెం నలందా జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు 920 మార్కులు సాధించి, ఎంసెట్ ద్వారా పాల్వంచాలోని ఆడమ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈఈఈ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్) శాఖలో బి.టెక్ సీటు పొందారు

బి.టెక్ సమయంలోనే ఆల్ ఇండియా గేట్ పరీక్షలో అద్భుత ర్యాంక్ సాధించి, జేఎన్‌టీయూహెచ్ విశ్వవిద్యాలయంలో ఎం.టెక్ సీటు పొందారు. ఎం.టెక్‌ను జేఎన్‌టీయూహ్‌లో విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, మళ్లీ ఆల్ ఇండియా గేట్ ర్యాంక్ ఆధారంగా జేఎన్‌టీయూహ్‌లోనే పీహెచ్.డి ప్రవేశం పొందడం ఆయన విద్యా ప్రయాణంలో మరో గొప్ప ఘట్టంగా నిలిచింది. విద్యార్థి జీవితంలో ఆయన కేవలం విద్యార్థిగా మాత్రమే కాకుండా విద్యార్థి నాయకుడిగా ఎదిగి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలిచారు

విశ్వవిద్యాలయంలోని టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ, జేఎన్‌టీయూ హెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా విలువైన సేవలు అందించారు

తదుపరి, ఆయన జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ పదవికి కూడా నియమితులయ్యారు. విద్యార్థి ఉద్యమాలతో పాటు తన పరిశోధనలో కూడా పట్టుదలతో కొనసాగి, నేడు డాక్టరేట్ డిగ్రీ సాధించడం ఆయన కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి ప్రతీక.

అంతేకాకుండా ఒకే కమ్యూనిటీతో కాకుండా అన్ని కమ్యూనిటీలతోనూ మంచినడవడి, పరస్పర గౌరవభావం కొనసాగిస్తూ,తన పుట్టిన కమ్యూనిటీకి న్యాయం జరిగేలా అనేక పోరాటాలు చేశారు. సమాజంలోని అన్ని వర్గాలతో సమానమైన సంబంధాలు కొనసాగిస్తూ, ఐక్యత, సామాజిక సమానత్వం కోసం తనదైన రీతిలో కృషి చేస్తున్నారు.

తన విద్యా ప్రయాణం మాత్రమే కాదు, సమాజం పట్ల కూడా ఆయనకు ఉన్న నిబద్ధత ప్రశంసనీయం. తన మాల కమ్యూనిటీ అభ్యున్నతి కోసం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి, సమాజ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ కమిటీ మరియు మాల మహానాడు రాష్ట్ర కమిటీ తరపున మంద రంజిత్ కుమార్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూలి,భవిష్యత్తులోఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నారు

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మరియు ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజాపాలన ద్వారా బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారు

**కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్**

**కుత్బుల్లాపూర్, నవంబర్ 11, (అక్షర గళం):** ప్రజాపాలన ద్వారా బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కొండా సుజాత, ఎరగాంధండ్ల వంశీ, రెడ్డి సత్యనారాయణ, నీరుడు ఓంప్రకాష్, మర్గం శంకర్, కొట్టె సులోచన గతంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంగళవారం తన నివాసం వద్ద మూడు లక్షల రూపాయల సిఎంఆర్‌ఆఫ్ చెక్కులు పంపిణి చేశారు.

ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అలాగే మంత్రి దుద్ధిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో కొనియాడారు. ప్రజాపాలనలో పేద,మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా , కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు సిఎంఆర్‌ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో దూలపల్లి మాజీ కౌన్సిలర్ బైరి శివకుమార్ గౌడ్, చౌద శ్రీనివాస్, నాగిళ్ల



శ్రీనివాస్, బాలప్ప, యాం సాగర్, ఉలిపి శ్యామ్, అరుణ్ కుమార్, రఘు గౌడ్, సంపత్, కృష్ణ, కృష్ణమ నాయుడు, కృష్ణారెడ్డి, లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించడం ద్వారా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చు

**గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**జూబ్లీహిల్స్, నవంబర్ 11, (అక్షర గళం):** ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించడం ద్వారా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 12, 14, 16, 17, 18, 23 కేంద్రాలను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రతి బూత్ వద్ద పోలింగ్ శాంతియుతంగా జరుగుతున్న విధానాన్ని ఆయన సమీక్షించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని తెలిపారు.

ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలింగ్ శాతం మందకొడిగా కొనసాగినప్పటికీ, ప్రజలు పెద్ద ఎత్తున బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా,





నిస్పాక్షికంగా ఓటు వేయాలని, ఇది ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను, పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు ప్రతి పౌరుడి గౌరవ చిహ్నమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించాలని గంగాధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మొత్తానికి ప్రజాస్వామ్య పండుగగా భావించే ఈ ఎన్నికల్లో అందరూ చురుకుగా పాల్గొని అధిక శాతంలో పోలింగ్ నమోదు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి.

**వెల్దండ నవంబర్ 11 (అక్షర గళం):** వెల్దండ మండల కేంద్రంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ అధ్యక్షతన సిఐటియు అనుబంధ రంగాలైనటువంటి ఆశా వర్కర్స్, అంగన్వాడి, మిడ్ డే మీల్స్, గ్రామపంచాయతీ వర్కర్స్, మరియు భవన నిర్మాణ కార్మికులతో విస్తృత సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, కేంద్రంలో బీజేపి ప్రభుత్వం వచ్చినప్పటినుండి ఆయా స్కీములకు క్రమంగా బడ్జెట్లో కోత విధిస్తున్నారని, అంతేకాకుండా స్కీమ్ వర్కర్లను కార్మికులు గాను గుర్తించడం లేదు అటు ఉద్యోగులుగా గుర్తించడం లేదని మండిపడ్డారు. స్కీం వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వారిని శ్రమదోపిడికి గురి చేస్తున్నారని అన్నారు. సుఐటియు జిల్లా మహాసభలను నవంబర్ 30 న తేదీన నాగర్ కర్నూల్ లో నిర్వహిస్తామని అన్నారు డిసెంబర్ లో 5 67 తేదీలలో సిఐటియు రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు సుఐటియు వెల్దండ




మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వెల్దండ మండల కన్వీనర్ గా మాసమ్మ, కమిటీ సభ్యులు స్వప్న ,యాదమ్మ ,జహీదా స్వరూప వినోద్ ,యాదయ్య ,చంద్రశేఖర్ రామచంద్రయ్య ,భీమ్ రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నిజామాబాద్ ఆస్పత్రిలో దారుణం

## చనిపోయిన మహిళ బంగారం మాయం

**నిజామాబాద్,నవంబర్11(అక్షర గళం):** నిజామాబాద్ ప్రగతి ఆసుపత్రిలో దారుణం జరిగింది. మహిళ డెడ్ బాడీపై బంగారం మాయం చేసిన ఘటన కలకలం రేపింది. బంగారం కనిపించకుండా పోవడంతో చనిపోయిన ఆ వృద్ధురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. గంగవ్వ అనే పెద్దావిడ గుండె నొప్పి రావడంతో సోమవారం సాయంత్రం నిజామాబాద్ ప్రగతి ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు.మంగళవారం ఉదయం 8 గంటలకు చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. ఆసుపత్రి సిబ్బంది బంగారం అపహరించారని పోలీసులకు బంధువులు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఎవరు ఆ బంగారం దొంగిలించారనే విషయం తెలియలేదు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న 18 గ్రాముల బంగారం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో లొల్లిలొల్లి చేశారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి గంగవ్వ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బంగారం మాయం చేసిందెవరో తేలేదాకా గంగవ్వ డెడ్ బాడీని అక్కడ నుంచి తీసుకెళ్లేది లేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు తెగేసి చెప్పారు. ఈ ఘటన నిజామాబాద్ టౌన్‌లో హాట్ టాపిక్ అయింది.

# క్షతగాత్రులకు ఢిల్లీ సిఎం రేఖాగుప్తా పరామర్శ

## మృతుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**న్యూఢిల్లీ,నవంబర్11(అక్షర గళం):** ఢిల్లీ పేలుళ్ల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి రేఖాగుప్తా రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఎర్ర కోట సమీపంలోని జరిగిన పేలుళ్ల ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.



పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ ప్రమాదంలో శాశ్వత వైకల్యం పొందిన బాధితులకు ముఖ్యమంత్రి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2 లక్షల సాయం అందిస్తామని చెప్పారు. క్షతగాత్రులకు పూర్తి నాణ్యతాయుతైన వైద్య చికిత్స అందిస్తామని భరోసా ఇచ్చారు. పేలుడులో గాయపడి లోక్‌నాయక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రేఖాగుప్తా మంగళవారంనాడు పరామర్శించారు. వారికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు. దీనికి ముందు ఢిల్లీ ఘటనపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సీఎం ఆవేదన వ్యక్తం చేసారు. 'ఈ దురదృష్టకర ఘటనతో ఢిల్లీ సిటీ మొత్తం షాక్‌కు గురయింది. ఈ కష్టకాలంలో తమ సొంతవారిని కోల్పోయిన కుటుంబాలు, క్షతగాత్రులకు సంతాపం తెలియజేస్తున్నాను. వారికి అండగా నిలుస్తాం' అని సీఎం ట్వీట్ చేశారు.

# వరదబాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం

## రూ.12.99 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్,నవంబర్ 11(అక్షర గళం):** మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే. ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే.

# నార్త్ ఈస్ట్ కనెక్ట్ ప్రోగ్రామ్

## ఐమాక్స్‌లో చిత్రాల ప్రదర్శన - స్పెషల్ కమిషనర్ ప్రియాంక

**హైదరాబాద్,నవంబర్11 (అక్షర గళం):** నార్త్ ఈస్ట్ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ నెల 21,22 తేదీల్లో ఐమాక్స్ థియేటర్ లోని స్క్రీన్ -4, స్క్రీన్ -5లలో పలు భాషల సినిమాలను ప్రదర్శించనున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 8 సినిమాలతో పాటు 4 తెలుగు సినిమాలు ప్రదర్శించనున్నట్లు తెలి పారు. ఆయా సినిమాల దర్శకులు, ఇతర ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొ నన్నున్నారు. ఐమాక్స్ థియేటర్‌ను మంగళవారం స్పెషల్ కమిషనర్ సందర్శిం చారు. సినిమాల ప్రదర్శనకు, ఆహ్వానితులకు ఎటువంటి ఇబ్బంది కలుగ కుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకి, థియేటర్ నిర్వాహకులకు సూచించారు. వివిధ వేదికలపై ఐటి, కల్చర్ ప్రోగ్రామ్‌ల తో పాటు సినిమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఫిలం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో సినిమాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సమాచార పౌర సంబం ధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, రాధా కిషన్, ఉప సంచాలకులు యాసా వెంకటేశ్వర్లు, థియేటర్ జనరల్ మేనేజర్ వెంకట ప్రసాద్, ప్రతినిధి రఘురామ్, ఈక్ష ప్రతినిధి సంజయ్, మాచిరాజు సాయి ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

## రుచికరమైన భోజనం అందచేత

## భూదాన్ పోచంపల్లి పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

**యాదాద్రిభువనగిరి,నవంబర్11(అక్షర గళం):** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందని, పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేశారు. రోజు ఈ విధంగానే భోజనం పెడుతున్నారా, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో విద్యార్థుల గణిత సామర్థ్యాన్ని ఆయన పరిక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఎక్కువ మార్కులు వచ్చిన 250 మంది విద్యార్థులకు సైకిల్ అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు టాయిలెట్స్, వాటర్ పైప్ లైన్ కనెక్షన్లు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ను ఆదేశించారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని దృష్టికి తీసుకురాగా పోలీసులు పెట్రోలింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జూలూరు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, గతంలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, లారీలు టార్పాలిన్ కవర్స్, గన్ని బ్యాగుల కొరత లేదన్నారు. ట్యాబ్ ఎంట్రీ చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని, ఇప్పటివరకు జిల్లాలో రూ.30 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. ఆరుగాలం కష్టపడి రైతన్నలు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మవద్దని, చివరి గింజ వరకు ధాన్యనీ కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.





# సందర్శకులకు ఎర్రకోట మూసివేత

## వెల్లడించిన ఆర్కియాలజీ శాఖ

**న్యూఢిల్లీ,నవంబర్11(అక్షర గళం):** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు సందర్శకులకు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు.

అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను కూడా మూసివేశారు.



# త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు

## అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్,నవంబర్11(అక్షర గళం):** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో రానున్న రోజులలో త్రాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ విభాగం పని తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంజీర, సింగూరు, గోదావరి పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశిరచిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఊఓఆం కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఖఅఅఈ డాక్టర్ సి. సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ అధికారి కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# నక్కలగండి పూర్తికాక తీవ్ర ఇబ్బందులు

## సాగర్ తలాపున ఉన్నా నీటి గోస తప్పడం లేదు

## నక్కలగండి నిర్వాసితులతో కవిత సమావేశం

**నల్గొండ,నవంబర్11(అక్షర గళం):** నాగార్జున సాగర్ ప్రాజెక్టు తల మీద ఉన్నా నల్గొండ జిల్లాలోని కొన్ని మండలాలకు ఇప్పటికీ నీరు అందడంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నక్కలగండి ప్రాజెక్టు సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. కేసీఆర్ గత ఉప ఎన్నికల ముందు నెల్లికల్ లిఫ్ట్ పనులు ప్రారంభించినా అప్పటి జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి ఏడాదిలో పూర్తి చేస్తామని లేకుంటే రాజీనామా చేస్తామని వాగ్దానం చేశారని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నెల్లికల్ లిఫ్ట్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకపోవడం దారుణమని చెప్పారు. పత్తి రైతులు గత

ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్ముకున్నారని.. పత్తి రైతుల కోసం సీసీఐ నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లాలో అధికంగా ఉన్న పత్తి రైతుల కష్టాలు జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతి పక్ష పార్టీ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మునిగిపోయారు తప్ప ప్రజల కష్టాలు పట్టడం లేదని దుయ్యబట్టారు. ఎన్టీఆర్ హయాంలో రూపకల్పన చేసిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు ఆధారంగా నక్కల గండి ప్రాజెక్ట్ కట్టాలని నిర్ణయించారు. 2009లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 545 కోట్లతో ప్రాజెక్ట్ ప్రణాళిక సిద్ధం చేసింది. అప్పటికీ తెలంగాణ ఉద్యమం సాగుతుండటంతో పనులు జరగలేదు. తెలంగాణ వచ్చే వరకు



కూడా ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగాయి. తెలంగాణ వచ్చాక 8 కిలోమీటర్ల వరకు టన్నెల్ తవ్వే ప్రయత్నం జరిగింది. కానీ సాంకేతిక కారణాలతో ప్రాజెక్ట్ పనులను ఆపాల్సి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సాంకేతిక లోపాలను పట్టించుకోలేదు. దాంతో



పెద్ద ప్రమాదం జరిగి 8 మంది చనిపోయారు. ఇప్పటికి నక్కల గండి సహా మరో రెండు తాండాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. మొథ్యా తాండా ప్రజల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అసలు ఈ ప్రభుత్వం ఎస్ఎల్ బీసీని ఎప్పుడు పూర్తి చేస్తుందో చెప్పాలి' అని కవిత డిమాండ్ చేశారు.

# మొంథా తుపాన్ నష్టం నుంచి గట్టెక్కించండి

## ఆంధ్రప్రదేశ్‌కి అదనపు నిధులు కేటాయించండి

## కేంద్ర మంత్రి చౌహాన్‌కు చంద్రబాబు వినతి

## గంటపాటు ఇరువురు నేతల చర్చలు

**అమరావతి,నవంబర్11(అక్షర గళం):** ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పీడీఎంసీ స్కీం కింద ఆంధ్రప్రదేశ్‌కి అదనపు నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దాదాపు గంటపాటు వీరి సమావేశమైయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం, మైనర్ ఇరిగేషన్ తదితర అంశాలపై వీరిరువురు చర్చించారు. మొంథా తుపాన్ వల్ల జరిగిన నష్టాన్నికేంద్ర మంత్రి చౌహన్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. ఇక మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సహకారించాలని చౌహన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు కలిపి మొత్తం రూ.695 కోట్లు ఇవ్వాలని ఆయనను సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద తోతాపూరి రైతులకు ఇచ్చిన మద్దతు ధరలో కేంద్ర ప్రభుత్వ వాటాను సైతం విడుదల చేయాలన్నారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఇవ్వాల్సిన రూ.100 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. గుంటూరు పర్యటనకు వచ్చిన

నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు కేంద్ర



మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్.. అమరావతిలోని క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పర్యటించారు. నల్లపాడు లయోలా స్కూల్‌లో ఆయన పైలాన్ ఆవిష్కరించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా వెంగళాయపాలెం చెరువు వద్ద రూ. 1.20 కోట్లతో చేసిన అభివృద్ధి పనులని శివరాజ్ సింగ్ చౌహన్ పరిశీలించారు. అనంతరం వెంగళాయపాలెం చెరువును కేంద్ర మంత్రి చౌహన్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ.. పురాతన వెంగళాయపాలెం చెరువుని అత్యాదునికంగా పునరుద్ధరించారన్నారు. వెంగళాయపాలెం చెరువు ద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. వెంగళాయపాలెం చెరువు ద్వారా పశువులకు తాగునీరు లభిస్తుందని పేర్కొన్నారు. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి ఈ చెరువుని వినియోగించుకోవచ్చని సూచించారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్.. ప్రజలకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహన్‌తో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహ్మద్ నజీర్, గల్లా మాధవితోపాటు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. మరోవైపు మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఈ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. అనంతరం మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి.. జరిగిన నష్టాన్ని కేంద్ర బృందం సోదాహరణగా వివరించింది.

# ఢిల్లీ పేలుళ్ల ఘటనలో ఆందోళనకర విషయాలు

## ఉగ్రవాద కార్యకలాపాలకు నిధుల సేకరణ


## పట్టుబడ్డ మహిళ డాక్టర్ షాహీన్ కీలక పాత్ర

**న్యూఢిల్లీ,నవంబర్ 11(అక్షర గళం):** ఢిల్లీ పేలుళ్ల ఘటన తీరుతెన్నులతో దర్యాప్తు సంస్థలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యావంతులు అతివాదంవైపు మొగ్గు చూపుతున్న వైనంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఫరీదాబాద్ ఉగ్రకుట్ర భగ్నం తరువాత ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుళ్లు సంభవించిన విషయం తెలిసిందే. ఇక ఫరీదాబాద్‌లో పలువురు ఉగ్రవాదుల అరెస్టు అనంతరం డా.ఉమర్ అప్రమత్తమై ఢిల్లీలో కారుతో ఆత్మాహుతి దాడికి దిగాడని పోలీసులు భావిస్తున్నారు. ఇక ఫరీదాబాద్ ఉదంతంలో పట్టుబడ్డ మహిళ డాక్టర్ షాహీన్.. ఉగ్రవాదులకు నిధుల సేకరణలో కీలకంగా వ్యవహరించినట్టు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆమెను విచారిస్తున్నారు. డా.షాహీన్ సయీద్ యూపీ వాస్తవ్యురాలు. ఆత్మాహుతి దాడి చేసిన ఉగ్రవాది ఉమర్‌కు ఆమె తెలుసని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో కీలక నిందితుడిగా ఉన్న ముజమ్మిల్‌తో ఆమెకు సంబంధం ఉందని కూడా తెలుస్తోంది. భారత మహిళల్లో మతోన్మాదానాన్ని రెచ్చగొట్టేందుకు పాక్ ఉగ్ర సంస్థ జైష్-ఏ- మహమ్మద్ ప్రయత్నాలతో డా.షాహీన్ అతివాదంవైపు మళ్లినట్టు తెలుస్తోంది. ఇతర మహిళలను తమ కార్యకలాపాల్లో చేర్చుకునేందుకు కూడా ప్రయత్నించినట్టు సమాచారం. తమ ఉగ్ర కార్యకలాపాల కోసం నిందితులు దాదాపు రూ.45 లక్షలు సేకరించినట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ అంశంలో డా. షాహీన్ కీలకంగా వ్యవహరించింది. డాక్టర్‌గా తనకున్న నేపథ్యం, పరిచయాల మాటున ఆమె నిధుల సమీకరణకు సహకరించింది. సంక్షేమ కార్యక్రమాల మాటున ముజమ్మిల్, ఉమర్, షాహీన్ మధ్య వైద్య సీక్రెట్‌గా సమాచార మార్పిడి జరిగినట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమాల మాటునే వారు నగదు అక్రమ రవాణా కార్యకలాపాలను కప్పిపుచ్చారు. ఇక అల్ ఫలాలా నెట్వర్క్‌తో డా.షాహీన్‌కు ఉన్న సంబంధంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు సంస్థలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

# సంపాదకీయం..

## దేశ ప్రజలారా పారాహుషార్!

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు మరోమారు భారత్‌కు సవాల్ విసిరారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న గంటల్లోనే ఎర్రకోట వద్ద మారణహోమం సృష్టించారు. ఈ ఘటన జాతి యావత్తునూ ఉలిక్కిపడేలా చేసింది. పుల్వామా దాడి తరవాత పాక్‌పై


PTI


ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఇలాంటిది ఏదో ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదుల తో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడు తున్నారు. ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి గురించి ప్రజలు తెలుసుకోవాలి. సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండింది. ముఖ్యంగా ఎక్కడ ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయి నుంచే ప్రజలు అప్రమత్తం కావాలి. ఎవరు ఎక్కడికి వెళు తున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండాలి. ఈ క్రమంలో ప్రజలు ఇకనుంచి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ఎందుకంటే డాక్టర్లంటే ప్రాణాలు కాపాడాల్సిన వృత్తిలో ఉన్నవారు. వారే మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థల వేటలో తెలియనుంది. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఇది పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం అని గుర్తించాలి. ఈ దేశం గడ్డపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు దేశం ఏమయిన ఆఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఢిల్లీ ఎర్రకోట ఘటన సాయంత్రం దాదాపు 7 గంటల ప్రాంతంలో సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే దిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. వాస్తవాల ను ప్రజల ముందు ఉంచుతాం అని కేంద్రహోంమంత్రి అమిత్ షా తెలిపారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. ఇప్పుడు ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఇకపోతే దిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడుతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. పేలుడు ధాటికి పలువురి శరీర భాగాలు ఛిద్రమై..రోడ్డు, వాహనాలపై చెల్లాచెదురుగా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడిం చారు. పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు చెప్పారు. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్‌లోని దుకాణాల అద్దాలూ కూడా పగిలిపోయాయంటే ఎంతటి పేలుడు పదార్థాలు వాడోరో అర్థం చేసుకోవాలి. ఆ సమయంలో అందరూ ప్రాణభయంతో హాహాకారాలు చేస్తూ పరుగులు పెట్టారు. భవనాలు కంపించేంత స్థాయిలో పేలుడు తీవ్రత ఉందని ఓ దుకాణదారు తెలిపాడు. తాను నిలబడిన దుకాణం వణికిపోయింది. కిలోమీటరు దూరం నుంచే పేలుడు తీవ్రత గుర్తించారు. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, ఢిల్లీ మెట్రో స్టేషన్లలో భద్రతా సంస్థలు నిఘా వేశాయి. పుకార్లను నమ్మకూడదని.. ఏదైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం. భారతీయులంతా అప్రమత్తంగా లేకుంటే భారీ ప్రాణ నష్టాలను చవిచూస్తామని గుర్తించి ముందుకు సాగాలి.

## డాక్టర్ ఉమర్ సూత్రధారిగా గుర్తింపు

### పేలుడులో అమోనియం నైట్రేట్ వాడినట్లు అనుమానం

### ఎలా పేల్చాడన్న దానిపై ఆరా తీస్తున్న భద్రతా బలగాలు

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనకు చెందిన దర్యాప్తు కొనసాగుతున్నది. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ ఎలా ఆ కారును పేల్చి ఉంటాడని ఆరా తీస్తున్నారు. అయితే అమోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్‌ను వాడడం వల్లే భారీ స్థాయిలో పేలుడు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. హై ఇంటెన్సిటీ బ్లాస్ట్‌కు ఏఎన్ఎఫ్‌వోనే కారణం కావొచ్చు అని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే పేలుడు ఘటన జరిగిన సమీపంలో అమోనియం నైట్రేట్ ఆనవాళ్లను ఫోరెన్సిక్ అధికారులు గుర్తించారు. ఫిదాయిన్ తరహాలో ఆత్మహుతి దాడికి పాల్పడ్డాడు. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌లో డాక్టర్ ఉమర్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ సిటీలోని పలు ప్రదేశాల నుంచి సుమారు 2900 కేజీల ఆర్డీఎక్స్‌ను



సోమవారం రికవరీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎర్రకోట్ సమీపంలో కారు పేలిన సమయంలో.. దాంట్లో ఉమర్ ఒక్కడే ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. అమోనియం నైట్రేట్ చాలా శక్తివంతమైన పేలుడు పదార్థం. దీన్ని సాధారణంగా పరిశ్రమ పేలుళ్లకు వినియోగిస్తుంటారు. గతంలో ఉగ్రవాదులు పలుమార్లు ఈ రసాయనాన్ని వాడారు. ఐఈడీల్లో దీన్ని వినియోగించినట్లు తెలుస్తున్నది. శక్తివంతమైన పేలుడు ధాటికి పలు మీటర్ల దూరంలో ఉన్న వాహనాల అద్దాలు కూడా పగిలిపోయాయి. చాలా దూరంలో ఉన్న బిల్డింగ్‌ల్లోనూ ఆ శబ్దం వినిపించింది. టెర్రర్ మాడ్యూల్‌తో లింకున్న ఇద్దరు డాక్టర్లను పట్టుకోవడంతో.. భయాందోళనకు గురైన డాక్టర్ ఉమర్ ఈ పేలుడుకు పాల్పడి ఉంటాడని అంచనా వేస్తున్నారు.

# ఓట్ల కోసం ఖజానాకు తూట్లు

బీహార్ రెండో దశ పోలింగ్‌కు సిద్ధమైంది. 1.30 మిలియన్ మంది జనాభా కలిగిన బీహార్‌లో ఓట్లను కొల్లగొట్టడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం అపారమైన సంక్షేమ ప్యాకేజీని ప్రకటించింది. ఇది తీవ్రమైన ఆర్థిక పరిణామాలతో కూడుకుని ఉంటోంది. అత్యంత ప్రధానమైన ప్రస్తుత ప్రధాన రెండు పథకాలు ఇప్పటికే రాష్ట్ర ఆదాయంలో 10 శాతం వరకు హరించి వేస్తున్నాయి. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఓట్లు వేయడానికి వెళ్లక ముందే 1.5 కోట్ల మంది మహిళలు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన (ఎంఎంఆర్‌వై) పథకం కింద నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో నుంచి రూ. 10 వేలు వంతున నగదు అందుకోగలిగారు. ఎక్కువ మంది మహిళలు నమోదు కావడంతో అసలు వ్యయం ఇంకా పెరగవచ్చు. మరో 1.1 కోట్ల మంది ముఖ్యంగా వితంతువులు, వృద్ధమహిళలు, వికలాంగులు వీరందరికీ నెలవారీ పెన్షన్ రూ. 400 నుంచి రూ. 1100 వరకు మూడు రెట్లు పెరిగింది. ఫలితంగా ఏటా పెన్షన్ కింద ప్రతి పెన్షనర్‌కు రూ. 8400 వంతున పెరిగింది. ఈ మొత్తం అంతా రూ. 9420 కోట్ల వరకు అదనపు భారాన్ని పెంచింది.

ఈ రెండు పథకాలకు కలిపి 2025 26 రాష్ట్ర బడ్జెట్ ఆదాయంలో పదో వంతు వ్యయాన్ని కేటాయించవలసి వస్తోంది. ఇవి కేవలం హామీలు మాత్రమే కాదని గుర్తించడం అవసరం. ఎంఎంఆర్‌వై పథకం నిధులు ఇప్పటికే పంపిణీ అయ్యాయి. పెన్షన్ నిధుల కేటాయింపు కూడా జులై నుంచి మొదలైంది. ఇంత భారీ మొత్తాన్ని ఎవరు భరిస్తారు? ఎంఎంఆర్‌వై పథకం నిధులు రుణం నుంచి లభిస్తాయా? లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటుగా అందుతాయా? సామాజిక భద్రత కింద పెరిగిన ఈ మొత్తం అంతా రాష్ట్ర ఖజానా నుంచే భరిస్తారని నివేదించడమైంది. కానీ దీని ప్రభావం ఇతర అభివృద్ధి కార్యక్రమాల నిధులపై ఎంతవరకు పడుతుంది? రాష్ట్ర ప్రభుత్వం తన మూలధన వ్యయాన్ని తగ్గిస్తుందా? అంటే దీని అర్థం కొత్తగా రోడ్లు, స్కూళ్ల నిర్మాణానికి, విద్యుత్ ఉత్పత్తికి, ఇతర అభివృద్ధి పథకాలకు కావలసిన పెట్టుబడుల్లో కోత విధిస్తుందా? ఈ మేరకు పెరిగిన ద్రవ్యలోటు ఫలితంగా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతుందా? ఇవన్నీ తలెత్తుతున్నాయి. ముక్తసరిగా చెప్పాలంటే ఎన్‌డిఎ సంక్షేమ ప్యాకేజీ దేశంలోని అత్యంత నిరుపేద, కనీస అభివృద్ధి కూడా లేని బీహార్ రాష్ట్రంలో ఆర్థిక వినాశనానికి విత్తనాలు నాటిందా? గత ఏడాది బీహార్




ఆర్థికలోటు రాష్ట్ర జిడిపిలో 9.2 శాతంగా ఉంది. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలకు మూడు సార్లు ఆర్థిక లోటును భరించడానికి వీలుంటుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను గత మార్చిలో ప్రవేశ పెట్టినప్పుడు ఆర్థిక లోటును 3 శాతానికి తగ్గిస్తానని రాష్ట్ర ప్రభుత్వం ధైర్యంగా హామీ ప్రకటించింది. అయితే అది ఇప్పుడు జరిగే అవకాశం లేకుండా సంక్షేమ ప్యాకేజీ ఆశలను చెల్లాచెదురు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ భారీ సంక్షేమ ప్యాకేజీ ప్రకటనకు ఓటర్లు సంతోషంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఆర్థిక బాధ్యతారాహిత్యానికి విపక్షాలు ఏ విమర్శలు చేయకుండా దూరంగా ఉంటున్నాయి. దీనికి పోటీగా అవి కూడా భారీ హామీలతో తమ స్వంత సంక్షేమాన్ని ప్రకటించాయి. క్షేత్రస్థాయిలో ఈ రాజకీయ క్రీడ చాలా తేడాగా ఉంటోంది. ఎందుకంటే నితీశ్ ప్రభుత్వం ఇప్పటికే తమ హామీలను అమలు చేస్తుండడంతో విపక్షకూటమి కేవలం హామీలు ఇస్తుందనే భావనతో ఓటర్లు ఉన్నారు. దళారుల ప్రమేయం కానీ, అవినీతి కానీ చోటు చేసుకోకుండా ఓటర్ల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయడం నితీశ్‌కు ప్లస్ పాయింట్‌గా కనిపిస్తోంది. గతంలో ఇలాంటి నగదు పంపిణీ, తదితర పథకాల్లో కేవలం 15 శాతం వరకే ప్రయోజనాలు లబ్ధిదారులకు అందేవి. సాధారణంగా పాలనలోఉన్న ముఖ్యమంత్రులపై ఎంతో కొంత వ్యతిరేకత ఉండడం సహజం. రాష్ట్రాల్లో పాలన సరిగ్గా లేకుంటే ఎన్నికలు వచ్చినప్పుడు వ్యతిరేకంగా ఓట్లు వేసి తమ కోపం తీర్చుకుంటుంటారు. ఈ విషయంలో నితీశ్ ముందుగానే జాగ్రత్త పడ్డారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను గమనించి దాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

మోడీ ప్రభుత్వంతో జతకట్టి అధికారంలో ఉండడంతో ఓటర్లలో ఉన్న కొద్దిపాటి వ్యతిరేకతను అధిగమించడానికి ప్రయత్నించారు. భారీ సంక్షేమ పథకాలతో ఓటర్లను ఊరించే పనిచేశారు. ఈ పరిస్థితుల్లో భారీ సంక్షేమ పథకాలు గేమ్ ఛేంజర్ అవుతాయా? మరోవైపు ప్రధాన విపక్షకూటమి ‘మహాఘట్‌బంధన్’ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 20 రోజుల్లోనే కుటుంబానికి ఓ ఉద్యోగం కల్పిస్తామని హామీ ప్రకటించింది. బీహార్‌లో 2.97 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. నెలకు రూ.15,000 నుంచి రూ. 20,000 వంతున ప్రతి కుటుంబానికి ఖర్చు పెట్టవలసి వస్తుందని లెక్క వేసినా మొత్తం వ్యయం రూ. 5.35 లక్షల కోట్లు నుంచి రూ.7.13 లక్షల కోట్ల వరకు వ్యయం కాక తప్పదు. ఇది ఉద్యోగ వాగ్దాన అసంబద్ధతను తెలియజేస్తుంది.

ఈ సరళమైన గణాంకం మహాఘట్‌బంధన్ ఆలోచన లోని శూన్యతను తెలియజేస్తుంది. ఇది కాక ఐదేళ్ల పాటు వడ్డీ లేని నగదు రూ. 5 లక్షల వరకు అందజేస్తామని, పంటల సేకరణ గ్యారంటీ, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా ఇవన్నీ మహాఘట్‌బంధన్ మేనిఫెస్టోలో చేర్చిన ప్రధాన అంశాలు. అయితే ఆర్థిక నిపుణులు, రాజకీయ పరిశీలకులు ఈ ఉచిత హామీలు వచ్చే ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపించవని వాదిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకు ఖాతాల ద్వారా రూ. 10 వేలు అందుకుంటున్న మహిళలు కూడా చాలామంది ప్రభుత్వం మార్పును కోరుతుండడం గమనార్హం.

# తనిఖీ సరే, బోధన ఎలా!



ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు శాశ్వతంగా తనిఖీ బృందాలు నియమించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. సుమారు 24 వేలపైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల తనిఖీకి 299 కమిటీలువేసి వాటిలో పాఠశాలల్లో బోధించి కనీసంగా పదేళ్ళ బోధనానుభవం కలవారిని శాశ్వతంగా తనిఖీ బృందాలుగా నియమిస్తారు. 16,474 ప్రాథమిక పాఠశాలల తనిఖీకి 504 మంది ఉపాధ్యాయులతో 168 తనిఖీ బృందాలు, 3,100 మాధ్యమిక పాఠశాలలకు 105 మంది ఉపాధ్యాయులను 35 బృందాలుగా, 4,672 ఉన్నత పాఠశాల పర్యవేక్షణకు 864 మంది ఉపాధ్యాయులతో 96 పర్యవేక్షణా బృందాలు వెరసి 1473 మంది ఉపాధ్యాయులు శాశ్వతంగా మానెటరింగ్ ప్రక్రియలో వినియోగం చేస్తారు. ఇక ఈ తనిఖీ బృందాలలో నియమితులైన వారెవరూ ఇంకా వారివారి పాఠశాలల కెళ్ళి పాఠాలు చెప్పవలసిన పనిలేదు. అంటే 1473 పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనా సేవలు ఇంకా అందవని అర్థం.

ఇక గత ముప్పైఏళ్ళుగా పాఠశాలల తనిఖీ అధికారులు అయిన మండల విద్యాశాఖ్య అధికారులు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ పోస్టులు నింపకుండా విద్యాశాఖ చోద్యం చూస్తొ ఉంది. అత్యంత కీలకమైన ఈ పాఠశాల తనిఖీ అధికారులు పోస్టులు నింపకపోగా తాత్కాలిక ప్రాతిపదికన ఇన్‌ఛార్జీలను వేసి చేతులు దులుపుకుంటున్నారు. నియమించిన ఈ తనిఖీ అధికారులు ఎప్పటిదాకా ఉంటారో, పోస్టు ఎప్పుడు ఊడుతుందో తెలియని స్థితిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో 634 మండల విద్యాశాఖ అధికారులు, 70 మంది జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, 33 మంది జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీకి అధికారికంగా ఉండగా, తాజాగా ఈ నియామకాల వల్ల విద్యాశాఖ సాధించేది ఏమీ ఉండదు? ఇంతకు ముందు అనుభవాలు మనకు ఉండనే ఉన్నాయి. సర్వశిక్షా అభియాన్ నేతృత్వంలో ఓ 30 ఏళ్ళ క్రితం మండల విద్యా వనరుల కేంద్రంలో ముగ్గురు ఉపాధ్యాయులు బృందాలను మండల రీసోర్స్ పర్సన్ లుగా నియమించి ఓ దశాబ్దం పాటు ప్రయోగం చేశారు. ఈ రీసోర్స్ పర్సన్ల నియామకం వలన ఎలాంటి అదనపు ప్రయోజనం చేకూరే లేదని, పైగా ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందని తిరిగి వారందరినీ వారివారి పాఠశాలకు పంపించి వేశారు. తనిఖీ బృందాలలో నియమితులైన వీరు ఉద్యోగ ధర్మం కంటే సొంతపనులపై తిరిగారనే విమర్శలు ఉన్నాయి. కొందరైతే సొంత వ్యాపారాలు ప్రారంభించారు.

మరికొందరు ఉద్యోగ ధర్మం నిర్వర్తించాల్సిన సమయంలో సొంత పనులు చక్కబెట్టుకున్నానే ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే విద్యాహక్కు చట్టం -2009 వచ్చిన తర్వాత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతృత్వంలో ఒక సబ్జెక్టు నిపుణుల బృందంను వారంలో ఒకరోజు ఇతర పాఠశాలల తనిఖీకి వాడుకున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడుతుంది అన్న ఉద్దేశంతో ఈ విధానానికి కూడా మంగళం పాడారు. గత అనుభవాలు ఉండికూడా ఇప్పుడు మళ్ళీ అదే ప్రయోగం చేయడం వలన విఫల ప్రయోగం కాదా? తెలంగాణ విద్యా శాఖ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. పైగా ఈ తనిఖీ బృందాలు నియామకం వలన మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ ఉప అధికారులకు ప్రత్యామ్నాయంగా మరో అధికార కేంద్రం అనధికారికంగా పెట్టారనే భావన, పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు తమ తోటి ఉపాధ్యాయులే, సమాన హొదాలో తమను తనిఖీ చేయడం ఏమిటి? అనే ఒక రకమైన ఆత్మనూన్యతకు గురయ్యేఅవకాశం ఉంది.

ఇక తనిఖీ బృందాలకు టిఎ, డిఎల కోసం లక్షల రూపాయలు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంతచేస్తే చివరకు 60 శాతం విద్యార్థులు చదువుతున్న ప్రైవేటు పాఠశాలలు తనిఖీకి వీరికి అధికారం కల్పిస్తారా? లేదా? కేవలం 40 శాతం పిల్లలున్న ప్రభుత్వ పాఠశాలకే ఈ తనిఖీలను పరిమితం చేస్తారా? ఇలా చేసినట్లైతే అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ నియంత్రణ కనీసంగా లేని ప్రైవేటు పాఠశాల మానెటరింగ్‌కు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రైవేటు పాఠశాలల ప్రక్షాళన, నియంత్రణ అవసరం లేదా? అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన, కేవలం గణితం, సైన్స్ తప్ప మరో సబ్జెక్టుపై బోధన కేంద్రీకరించలేని ప్రైవేటు పాఠశాల తనిఖీ బాధ్యత ఎవరు చేపట్టాలి? ఇక విద్యాహక్కు చట్టం -2009 లోని నిబంధన 19 (1)హెచ్ ననుసరించి 2010 ఏప్రిల్ నుండి మన పరీక్షా విధానం సమూలమైన మార్పుకు గురైంది.

సులభతరమైన, ఒత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానంలో తనిఖీ అధికారులు అవసరం లేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తరగతి గది మధ్య ఎప్పటికప్పుడు అత్యంత సులభతరంగా ఈ పరీక్షలు కొనసాగుతాయి. ఈ పునచ్ఛరణ అనుభవం నుండే అటు ఉపాధ్యాయుడు తన బోధనా అనుభవాలు స్థిరీకరణ జరుగుతుంది. మరోవైపు విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు సరిదిద్దుకొంటారు. ఎందుకో మన తెలంగాణ విద్యాశాఖ ఇసిసిఇ విధానాన్ని జీర్ణించుకున్నట్లు కనిపించడంలేదు. అందుకు తాజా ఉదాహరణ గత దశాబ్ద కాలంగా నడుస్తున్న పదవ తరగతి పరీక్షలలో గ్రేడులకు బదులు తిరిగి మార్కులు ప్రవేశపెట్టడం. తరగతి గది మూల్యాంకనం ప్రక్రియ అయిన నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం అవుతుంది. పరీక్షలను చట్టబద్ధ స్థితి నుంచి ప్రైవేటు విద్యా సంస్థలు మెప్పు కోసం గ్రేడుల నుండి మార్కుల వైపు మొగ్గు చూపిన వైనం స్పష్టంగా కనపడుతుంది. గతంలో మండల రీసోర్స్ పర్సన్ల నియామకాలు వలన తేలింది ఏమంటే చాలా చోట్ల ఎంఆర్‌పిలు తమ విధులు విస్మరించి సొంత పనుల వైపు మొగ్గారు.

విద్యాశాఖ అధికారులకు దళారీ వ్యవస్థగా పని చేశారు. పాఠశాలలు తనిఖీలు చేయాల్సిన వీరు కాగితాలు స్వీకరించి, కాకి లెక్కలు, గణాంకాలు, నివేదికలు స్వీకరించే పరిస్థితి మాత్రమే ఉండేది. ఆ కాగితాలు కంప్యూటర్ కెక్కించడంపై సమీక్షలు తప్ప ఎలాంటి ప్రయోజనం ఒనగూడలేదు! కనుక తెలంగాణ విద్యాశాఖ పెద్ద సంఖ్యలో శాశ్వతంగా మానెటరింగ్ జట్టును నిర్మించేటప్పుడు గత అనుభవాలను తప్పనిసరిగా సమీ క్షించుకోవాలసిన అవసరం ఉంది. తనిఖీ అధికారులు ఏర్పరిచే ముందు నమోదు క్షీణించిపోతున్న ప్రభుత్వ బడుల సంస్కరణ, పునర్వ్యవస్థీకరణ వైపు దృష్టి పెట్టడంతోపాటు, ప్రైవేటు పాఠశాలల వనరులలోపం, నిబంధనలు ఉల్లంఘన, ఫీజుల క్రమబద్ధీకరణ తదితర విషయాలు తనిఖీ చేసి చక్కదిద్దాల్సిన బాధ్యత విద్యాశాఖ పైన ఉంది.

# ఉద్యమ జనజాతర అందెశ్రీ

బడికి వెళ్లి ఆయన అక్షరాలు చదవలేదు.. కానీ సమాజాన్ని ఆయన తన అంతర్‌హృదయంతో చూశారు. సమాజంలో జరుగుతున్న ప్రజల వ్యథలు, పోరాటాలను కళ్లతో చూసి.. ఆ బాధలే ఆయనను ప్రజల పక్షాన ప్రజా గొంతుకగా నిలబడేలా చేసింది. చిన్నతనం నుంచే అనాథగా బతికిన ఆయన గుండెకు తాకిన గాయాలు ఎన్ని ఉంటాయో.. గొడ్లకాపరిగా పని చేస్తూ ప్రకృతి.. మూగజీవాలతోనూ మమేకం అయ్యారు. ప్రకృతి ఎదుర్కొనే ముప్పును సైతం పదాల అల్లికతో జత కట్టి పాటలు, పద్యాలు పాడుకున్నాడు. సమాజంలో భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న ప్రజల బతుకులను చూశాడు. కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా.. మానవ సంబంధాలకు కనీస విలువనివ్వని సమాజాన్ని కళ్లారా చూశారు. ఆయన కళ్లతో చూసిందే.. పదాల అల్లికతో గేయంగా మారి ఆ గాయాన్ని మాన్పింది. అణచివేతలమీద ఆయన పాట ఉక్కు పిడికిళ్లుగా మారాయి.

అన్యాయంపై గళమెత్తే జనగర్జన అయింది. అందెశ్రీ ఉద్యమ జన జాతర. తెలంగాణ మలివిడత ఉద్యమం ఉధృతంగా మారిన సమయంలో అందెశ్రీ పాటలు ప్రజల్లో గొప్ప పోరాట పటిమను చూపాయి. జనజాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి.. జంజవారుతా జననినాదమై సాగాలి.. అంటూ మలివిడత ఉద్యమంలో ఆయన కవిత్వాలు లక్షలాది మందిని కదిలించాయి. చిన్నతనంలోనే కష్టాలు చూసిన అందె శ్రీ ప్రజల బతుకుల్లో గుణాత్మక మార్పు, సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో రచనలు చేశారు. చదువు లేకపోయినా ప్రజల అంతర్ హృదయాలను అందెశ్రీ చదివారు. రవి చేరనిచోటు ఉంటుంది కానీ కవి చేరని చోటు ఉండదు అన్నట్లుగా ఆయన కవిత్వం, పాటల రూపంలో ప్రతీ గుండెను తాకారు. ఆవేదనల గుండెలకు బలయ్యారు. అణచివేతపై తిరుగుబాటు గళం అయ్యారు. పోరాట పిడికిళ్లకు పదునైన గీతంగా మారాడు అందెశ్రీ.

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అనాథగా పెరిగిన అందెశ్రీ చిన్నతనంలోనే కష్టాలు వెంటాడాయి. తన కష్టాలను ప్రజల్లో, సమాజంలో చూసిన ఆయన తన పల్లెతో, ప్రకృతితో, మనుషుల హృదయాలతో మమేకం అయ్యారు. పల్లె జీవన బతుకులు తెలిసిన వ్యక్తిగా ‘పల్లె నీకు వందనాలమ్మో... తల్లీ నీకు వందనాలమ్మో.. అంటూ పల్లెను తల్లితో పోల్చి బతుకు



విలువను నేర్పిన పల్లెలలపై మమకారాన్ని చాటారు. ‘కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిసి మొక్కితే అమ్మరా’ మాయమైపోతు న్నాడమ్మా మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అంటూ సమాజంలో మంట కలుస్తున్న మానవ సంబందాలపై రాసిన పాటలన్నీ అయన గుండెల నుంచి సమాజం కోసం ఉప్పొంగిన గొప్ప అక్షరాలు.. తెలంగాణ మలివిడత ఉద్యమం ఉధృతంగా మారిన తరుణంలో ఆ గేయం ఓ పోరాట తిలకంగా నిలిచింది.

జనజాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి.. ఒకటే జననం.. ఓహో ఒకటే జననం.. జీవితమంతా జనమే మననం.. కష్టానష్టాలు ఎన్ని ఎదురైనా కార్యదీక్షలో తెలంగాణ అంటూ ఉప్పొంగిన గేయం తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష సాకారానికి ఎంతో భూమిక పోషించింది. అనేక రచనలు, కవిత్వాలతో ఆయన ఎంతోమంది సాహిత్యకారులకు, ప్రజాపోరాటాలకు ఓ చైతన్య గొంతుకగా నిలిచారు. ఆయన చేసిన అనేక రచనలకు కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను సైతం ప్రదానం చేసింది. దాశరథీ పురస్కారం, వాషింగ్టన్ డిసి వారి గౌరవ డాక్టరేట్‌తోపాటు లోకకవి అన్న బిరుదు పొందారు. 2015లో డాక్టర్ రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్టు వారి ఆధ్వర్యంలో జ్ఞాన పీఠ్ పురస్కార గ్రహీత ఆధ్వర్యంలో భరద్వాజ సాహితీ పురస్కారం.. దాంతో నంది అవార్డుతో పాటు ఎంతో మంది ప్రజల గుండెలను గెలుచుకున్నారు. తెలంగాణ మలివిడత ఉద్యమంలో ధూంధాంకు ఉన్న సాంస్కృతిక ఉద్యమ పాత్ర గొప్పది.

ఆ సమయంలో నాటి ఉమ్మడి పది జిల్లాలో తెలంగాణ ధూంధాం వేదికల మీద అందెశ్రీ పాటలు తెలంగాణ పల్లె బతుకులను కళ్లకుకట్టేలా చూపాయి. చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి.. నవ్వుల్లో నాగమల్లి నా ఊరు పాలవెల్లి.. మళ్లీ జనమా ఉంటే సూరమ్మో.. మళ్లీని కడుపున పుడతా మయమ్మో అంటూ తెలంగాణ పల్లె ఆత్మీయతను గొప్పగా ప్రదర్శించారు. సమాజం హితం కోసం అనేక రచనలు చేసి సాహితీ శిఖరంగా ఎదిగిన ఆయన నేడు తెలంగాణ గీతంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవనున్నారు. అందె శ్రీ రాసిన జయజయహే తెలంగాణ పాట నేడు రాష్ట్ర గీతంగా మారింది. సాహితీ లోకానికి, అటు గుణాత్మక సమాజం కోసం పరితపించిన అందెశ్రీ అకాల మృతి తీరని లోటు. అయినప్పటికీ ఆయన తెలంగాణ రాష్ట్ర గీతంగా ఎప్పటికీ ప్రజల గుండెల్లో తెలంగాణ ఉద్యమంలో జన జాతరను కదిలించిన సాహితీ శిఖరంగా కొలువై ఉంటాడు.



## డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే
# ఈ సిరీస్ గెలవాలి
### టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో ఫైనల్ చేరాలంటే సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో విజయం సాధించాలని టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ అన్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన సౌతాఫ్రికాను ఓడిస్తే డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రస్థానంలో నిలువవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ సైకిల్‌ను టీమిండియా డ్రాతో ప్రారంభించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా 61.5 విన్నింగ్ పర్సంటేజ్‌తో మూడో స్థానంలో కొనసాగుతుంది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్-2లో కొనసాగుతున్నాయి. గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా తృటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. అగ్రస్థానంలో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఫైనల్ చేరాయి. సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ప్రారంభం కానుంది. కోల్‌కతా వేదికగా తొలి మ్యాచ్ జరగనుండగా.. ఇరు జట్లు ముమ్మరంగా సాధన చేస్తున్నాయి. ఈ సిరీస్‌కు ముందు పాకిస్థాన్‌లో పర్యటించిన సౌతాఫ్రికా రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసుకుంది. సౌతాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన సిరాజ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్ ఈ నయా డబ్ల్యూటీసీ సైకిల్‌కు చాలా కీలకం. ప్రత్యేకించి సౌతాఫ్రికా డిఫెండింగ్ ఛాంపియన్ కాబట్టి ఆ జట్టును ఓడిస్తే ఫైనల్ చేరే అవకాశాలు మెరుగవుతాయి. ఆ జట్టు పాకిస్థాన్‌తో 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. మా ఫామ్‌పై మాకు నమ్మకం ఉంది. మేం సానుకూల వాతవరణాన్ని సృష్టించాం. ఇంగ్లండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేశాం. వెస్టిండీస్‌పై సిరీజ్ గెలిచాం. వ్యక్తిగతంగా నేను మంచి లయతో బౌలింగ్ చేస్తున్నాను. దానిని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నాను. బలమైన జట్టుతో ఆడుతున్నప్పుడు మెరుగుపర్చుకోవాల్సిన అంశాలు ఏంటో తెలుస్తాయి. ఈ సిరీస్‌లో ఎదురయ్యే సవాళ్ల కోసం నేను ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను.'అని సిరాజ్ చెప్పుకొచ్చాడు. ఈ సైకిల్‌లో మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ సైకిల్‌లో సిరాజ్ 7 మ్యాచ్‌లు ఆడి 26.54 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు.

## సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌కు
# భారత జట్టు ప్రకటన
### బౌలింగ్ కూర్పుపై మేనేజ్‌మెంట్ తర్జనభర్జన

భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభం కానుంది. అయితే, ఈ సిరీస్‌కు ముందు, భారత జట్టు ప్లేయింగ్ ఎలెవన్ ఎంపిక విషయంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు, రిషబ్ పంత్ పునరాగమనం, ధ్రువ్ జురెల్ అద్భుతమైన ప్రదర్శన జట్టు కలయిక విషయంలో కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌లను సందిగ్ధంలో పడేశాయి. రిషబ్ పంత్ తిరిగి రావడం ఇప్పటికే ముందే నిర్ణయించిన విషయం. వైస్ కెప్టెన్‌గా, ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతని స్థానం ఖచ్చితంగా ఉందని భావించారు. అయితే, సమస్య పంత్



కాదు, కానీ ధ్రువ్ జురెల్, అతను అరంగేట్రం చేసినప్పటి నుంచి దాదాపు ప్రతి సందర్భంలోనూ అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. అతని స్థిరమైన ప్రదర్శనలు, ఇండియా ఏ తరపున అతను చేసిన ఇటీవలి సెంచరీతో ఈ ప్లేయర్‌ను విస్మరించడం కష్టతరం చేశాయి. ఇంగ్లాండ్‌లో పంత్ గాయం తర్వాత, జురెల్ జట్టులో స్థానం సంపాదించాడు. అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. అందువల్ల, అతన్ని ఇప్పుడు తొలగిస్తే, అది అతనికి అన్యాయం అవుతుంది. ఎందుకంటే అతను అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి మధ్య కఠినమైన నిర్ణయం తీసుకోవడంలోనే పరిష్కారం ఉందని భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు. యువ బ్యాట్స్‌మన్‌ను త్యాగం చేయాల్సిన అవసరం ఉన్నా, జురెల్‌కు భారత జట్టులో చోటు కల్పించాలి అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో చెప్పుకొచ్చాడు. "ధృవ్ జురెల్, రిషబ్ పంత్ ఇద్దరూ జట్టులో ఉన్నారు. పంత్ వైస్ కెప్టెన్, అతను ఆడాలి. కానీ జురెల్ కూడా ఆడాలని నేను అనుకుంటున్నాను. ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతనికి చోటు కల్పించాలి. "సాయి సుదర్శన్ నంబర్ 3 లో ఆడాలని నేను నమ్ముతున్నాను. మీరు ఇప్పటివరకు నితీష్ కుమార్ రెడ్డికి ముఖ్యమైన బౌలింగ్ పాత్ర ఇవ్వలేదు. కాబట్టి, మీరు అతన్ని వదిలివేసి ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వవచ్చు" అని ఆయన అన్నారు. చోప్రా అభిప్రాయం ఇటీవలి గణాంకాల ఆధారంగా ఉంది. ఈ సీజన్‌లో భారత జట్టు తరపున రెడ్-బాల్ క్రికెట్‌లో ధ్రువ్ జురెల్ బ్యాటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. అక్టోబర్‌లో వెస్టిండీస్‌పై అతను 125 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా ఏపై అజేయంగా 132లి పరుగులు చేశాడు. అతని దేశీయ రికార్డు కూడా అద్భుతమైనది. మరోవైపు, నితీష్ కుమార్ రెడ్డి ఏ తప్పు చేయలేదు. కానీ, జట్టు యాజమాన్యం, కెప్టెన్ అతన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదు. గత టెస్ట్ సిరీస్‌లో, 21 ఏళ్ల అతను రెండు మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. అది ప్రభావం చూపడానికి సరిపోలేదు. అతని బ్యాటింగ్ కూడా జురెల్‌ను తొలగించాల్సినంత ప్రదర్శనను అందించలేదు.

**తొలి టెస్టుకు భారత ప్రాబబుల్ ప్లేయింగ్ 11:** శుభ్‌మన్ గిల్ (సి), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ (డబ్ల్యుకె) (విసి), కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్.




## డిసెంబర్ 17 నుండి
# ఐపీఎల్ మినీవేలం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మినీ-వేలం తేదీ, వేదిక గురించి కీలక అప్‌డేట్ వెలువడింది. సాధారణంగా డిసెంబర్ నెలలో జరిగే ఈ వేలానికి సంబంధించి, అధికారికంగా తేదీలు ఖరారు కానప్పటికీ, కీలకమైన నివేదికలు వేలం ఎప్పుడు, ఎక్కడ జరగనుందో స్పష్టం చేస్తున్నాయి. ఐపీఎల్ మినీ-వేలం 2026 ను డిసెంబర్ 17 లేదా 18 తేదీల్లో నిర్వహించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు నివేదిస్తున్నాయి. మెగా-వేలం జరిగిన తర్వాత (2025 సీజన్‌కు మెగా-వేలం జరిగింది), ఆ తరువాతి సీజన్‌కు (2026) సాధారణంగా మినీ-వేలం నిర్వహిస్తారు. ఈ వేలంలో ఫ్రాంచైజీలు తమ పర్స్‌లో మిగిలిన డబ్బుతో పాటు, విడుదల చేసిన ఆటగాళ్ల ఖర్చును జోడించుకుని వేలంలో పాల్గొంటాయి. డిసెంబర్ మధ్యలో ఈ ఈవెంట్‌ను నిర్వహించడం అనేది ప్రతీ ఏటా జరిగే ప్రక్రియలో భాగమే. ఐపీఎల్ వేలం చరిత్రలో ఒక ముఖ్యమైన మార్పుగా, 2026 మినీ-వేలాన్ని దుబాయ్‌లో నిర్వహించడానికి బీసీసీఐ ప్లాన్ చేస్తోందని తెలుస్తోంది. గతంలో కూడా ఐపీఎల్ వేలాన్ని ఒకసారి విదేశంలో నిర్వహించారు. దుబాయ్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రం కావడంతో, అన్ని ఫ్రాంచైజీల యజమానులు, ముఖ్యంగా విదేశీ యజమానులు, మేనేజ్‌మెంట్ బృందాలు సులభంగా వేలంలో పాల్గొనేందుకు ఇది అనుకూలమైన వేదిక. ఈ ఈవెంట్‌కు మరింత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఐపీఎల్ వేలాన్ని బెంగళూరు, జైపూర్, కోల్‌కతా, మరియు కొచ్చి వంటి భారతీయ నగరాల్లో నిర్వహించారు. దుబాయ్‌లో వేలాన్ని నిర్వహించడం ఐపీఎల్ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలవనుంది. ఈ తేదీ, వేదికపై తుది నిర్ణయం బీసీసీఐ ద్వారా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అయితే, సాధారణంగా మీడియా నివేదికలు సరైనవే అవుతుంటాయి. నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో బీసీసీఐ ఈ వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. జట్లు ఇప్పటికే తమ రిటెన్షన్ జాబితాలను సిద్ధం చేసి, ఏ ఆటగాళ్లను వేలంలోకి పంపించాలో నిర్ణయించుకుంటున్న తరుణంలో, ఈ అప్‌డేట్ ఐపీఎల్ అభిమానులకు ఉత్సాహాన్నిస్తోంది.




## ముంబై ఇండియన్స్‌తో రవీంద్ర జడేజా
# సీక్రెట్ డీల్..!

ఐపీఎల్‌లో సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ప్రస్తుతం మారుమోగిపోతున్నాయి. ట్రేడింగ్‌కు బంధించి చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య చర్చలు జరుగుతుండడంతో ఎవరు ఏ టీమ్‌లోకి వెళతారని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. మొదట రవీంద్ర జడేజా కోసం మొదట సీఎస్‌కేను రాజస్థాన్ సంప్రదించగా.. కానీ చర్చలు ఫలించలేదు. అదే సమయంలో సంజూ శాంసన్ కోసం ఢిల్లీ కూడా ప్రయత్నించగా.. ఇవి కూడా విఫలమయ్యాయి. మొత్తానికి ఫైనల్‌గా సంజూ శాంసన్‌ను తీసుకునేందుకు చెన్నై ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. సీఎస్‌కే నుంచి రవీంద్ర జడేజాతోపాటు సామ్ కర్రాన్ మోడీ మాట్లాడుతూ.. IPL గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఆటగాళ్ల మార్గదర్శకాలు చాలా ముఖ్యమైనవి అని.. ప్రతి ఆటగాడు తప్పకుండా పాటించాలని అన్నారు. జడేజా తన ఫ్రాంచైజీకి తెలియకుండా మరో టీమ్‌తో చర్చలు జరపడం నిబంధనలకు విరుద్ధమని.. అందుకే ఏడాది నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. దీంతో రవీంద్ర జడేజాను 2010లో రాజస్థాన్ రాయల్స్ టీమ్ నుంచి విడుదల చేసింది. ఆ తరువాత సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చిన జడేజా.. కొచ్చి టస్కర్స్ కేరళ తరపున ఆడాడు. ఆ సీజన్‌లో 14 మ్యాచ్‌ల్లో 283 పరుగులు, ఎనిమిది వికెట్లతో మంచి ప్రదర్శన చేశాడు. 2012 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లో చేరాడు. ఆ వేలంలో




లేదా మతిషా పతిరానాను తమకు ఇవ్వాలని రాజస్థాన్ కోరుతోంది. ఈ వారంలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. రవీంద్ర జడేజా ఐపీఎల్‌లో మొదట రాజస్థాన్ రాయల్స్‌తోనే ఎంట్రీ ఇచ్చాడు. 2008 మొదట సీజన్‌లో షేన్ వార్న్ నాయకత్వంలో రాజస్థాన్ ఛాంపియన్‌గా నిలిచిన టీమ్‌లో రవీంద్ర జడేజా సభ్యుడిగా ఉన్నాడు. ఆ తరువాత సీజన్‌లోనూ రాజస్థాన్‌కు ఆడిన జడేజా.. ఆ తరువాత చేసిన ఓ తప్పుతో ఒక సీజన్ నిషేధానికి గురయ్యాడు. 2010లో జడేజా తన ఫ్రాంచైజీ రాజస్థాన్‌కు తెలియజేయకుండా ముంబై ఇండియన్స్‌కు మారడానికి ప్రయత్నించాడు. ముంబై ఫ్రాంచైజీతో చర్చలు జరపడంతో IPL గవర్నింగ్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఒక సీజన్ మొత్తానికి జడేజాపై వేటు వేసింది. ఆ సమయంలో ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న లలిత్ అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో జడేజా ఒకటిగా నిలిచాడు. అప్పటి నుంచి సీఎస్‌కే జడేజా ప్రయాణం కొనసాగుతోంది. 2016, 2017లో రెండు సీజన్లు చెన్నై టీమ్‌పై నిషేధం విధించినప్పుడు.. సురేష్ రైనా నాయకత్వంలో గుజరాత్ లయన్స్ టీమ్‌కు జడేజా ప్రాతినిధ్యం వహించాడు. ఆ తరువాత మళ్లీ సీఎస్‌కే టీమ్‌కు తరుపున ఆడాడు. చెన్నై ఐదు టైటిళ్లు గెలవగా.. మూడు టైటిళ్లను గెలవడంలో జడేజా కీలక పాత్ర పోషించాడు. 2023 ఫైనల్‌లో జడేజా ఇన్నింగ్స్ మరపురానిది. మోహిత్ శర్మ వేసిన చివరి ఓవర్‌లో జడేజా అద్భుతంగా ఆడి టీమ్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. 2022 సీజన్‌లో చెన్నైకు టీమ్‌కు కొన్ని మ్యాచ్‌లు కెప్టెన్‌గా వ్యవహరించినా.. సక్సెస్ కాలేకపోవడంతో ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

## ఇంకా కోలుకుని శ్రేయాస్ అయ్యర్..

భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ స్వదేశానికి తిరిగి వచ్చాడు. గాయం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. అయ్యర్ పరిస్థితి మొదట అనుకున్న దానికంటే చాలా తీవ్రంగా ఉంది. ఈ సంఘటన తర్వాత ఒక సమయంలో, అతని ఆక్సిజన్ లెవల్స్ 50 కి పడిపోయింది. "అతను దాదాపు 10 నిమిషాలు సరిగ్గా నిలబడలేకపోయాడు. అతని చుట్టూ పూర్తిగా బ్లాక్‌అవుట్ ఏర్పడింది. అతను సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుంది" అని భారత బోర్డుకు ఒకరు తెలిపారు. నవంబర్ 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ పాల్గొనడంపై ఇంకా సందేహాలు ఉన్నాయి. నవంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్ట్ మ్యాచ్‌ల తర్వాత, భారత్ రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలో మూడు వన్డేలు ఆడనుంది. ఇటీవలే ఆస్ట్రేలియా నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన అయ్యర్ తనకు తగిలిన గాయం నుండి ఇంకా కోలుకోలేదని తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి ఫిట్‌గా ఉండటానికి మరింత సమయం అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. అయ్యర్ ఆరోగ్య స్థితి గురించి సెలక్షన్ కమిటీకి సమాచారం అందింది. వైద్య నివేదికల ప్రకారం అతను ఫిట్‌గా ఉండటానికి దాదాపు ఒక నెల కన్నా ఎక్కువ సమయం పడుతుందని పేర్కొన్నారు. "అతను పూర్తిగా ఫిట్‌గా ఉండటానికి ఎక్కువ సమయం పడుతుంది.




అతని గాయం తర్వాత బోర్డు, సెలక్షన్ కమిటీ తొందరపడటంలేదు. దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌లో అతను ఆడటం సందేహమే" అని భారత బోర్డులోని ఒక వర్గాలు ధృవీకరించాయి. అతను సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుందని భావిస్తున్నారు. గత వారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన 3వ వన్డే సందర్భంగా గాయపడిన అయ్యర్‌ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అలెక్స్ కారీని అవుట్ చేయడానికి డైవింగ్ క్యాచ్ తీసుకుంటూ అయ్యర్ నేలపై పడి గాయపడ్డాడు. పొత్తికడుపులో ప్లీహానికి గాయం కావడంతో అంతర్గత రక్తస్రావంతో ఆయనను సిడ్నీ ఆసుపత్రిలో చేర్చారు. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లి గత వారం డిశ్చార్జ్ చేశారు.



## రష్మిక మూవీ గర్ల్‌ఫ్రెండ్

# సక్సెస్ మీట్


**ముఖ్య అతిథిగా వస్తోన్న విజయ్**

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ చిత్రం ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా.. దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటించాడు. గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. వీకెండ్‌తో కాకుండా వీక్ డేస్‌లో కూడా ఈ చిత్రానికి హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి. అయితే ఈ సినిమా సాధించిన విజయం పట్ల చిత్రబృందం నవంబర్ 12న సక్సెస్ మీట్ నిర్వహించబోతుంది. ఈ సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా స్టార్ నటుడు విజయ్ దేవరకొండ రాబోతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ వేడుక మరింత గ్రాండ్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఎంగేజ్‌మెంట్ తర్వాత రష్మిక, విజయ్ ఒకేసారి వేదిక మీద కనిపించబోతుండటంతో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గర్ల్ ఫ్రెండ్ సినిమా కథ విషయానికి వస్తే.. భూమా (రష్మిక మందన్న) పీజీ చేయడానికి హైదరాబాద్ లోని ఓ కాలేజ్ లో జాయిన్ అవుతుంది. అదే కాలేజ్ లో పీజీ చేయడానికి వచ్చిన విక్రమ్ (దీక్షిత్ శెట్టి) భుమాని చూసి ఇష్టపడతాడు. భూమా కూడా విక్రమ్ ని ఇష్టపడుతుంది. విక్రమ్ కి జెలసీ, పోసిస్సివెన్స్ ఎక్కువ. తనది పాత కాలం మనస్తత్వం. విక్రమ్ తో రోజులు గడుపుతున్నకొద్ది భూమాకి కొన్ని విషయాలు అర్ధమవుతూ వస్తుంటాయి. రిలేషన్షిప్ లో ఓ చిన్న బ్రేక్ కావాలని ఆడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? విక్రమ్ ఎలా రియాక్ట్ అయ్యాడు ? ఈ కథలో దుర్గా (అను ఇమ్మానుయేల్) పాత్ర ఏమిటి? చివరికి భూమా ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది మిగతా కథ.





# సినిమా ప్రమోషన్‌లో రాజమౌళి స్టైలే వేరు

సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం ఓ ఆర్ట్. అది బాగా తెలిసిన వ్యక్తి రాజమౌళి. ఆయన పబ్లిసిటీ స్ట్రాటజీనే వేరు. ఆయన క్రియేటివ్ ఆలోచనలతో ఆ రీచ్ ఎక్కడికో వెళ్లిపోతుంది. అయితే పబ్లిసిటీలో కూడా రెగ్యులర్‌గా కాకుండా ఆయన కొత్త ఒరవడి తీసుకొస్తారాయన. ప్రస్తుతం మహేష్ బాబుతో చేస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' విషయంలో ఆయన థాట్స్ అన్ని భిన్నంగా ఉన్నాయి. మమూలుగా స్టార్ హీరోల సినిమాలంటే ఎంటైర్ మీడియా అక్కడే ఉంటుంది. ఆయా ఈవెంట్‌లను ఛానళ్లు అన్ని ప్రమోట్ చేస్తాయి. కానీ 15న జరగబోయే గ్లోబ్‌ట్రోట్ ఈవెంట్‌ను జక్కన్న ఎక్స్‌క్లూజివ్‌గా జియో, హాట్‌స్టార్‌కి ఇచ్చేశారు. అలాగే ఈ సినిమా అప్డేట్స్ విషయంలో కూడా కొత్త ఎత్తుగడను ఫాలో అవుతున్నారు. ముందు నుంచీ కూడా ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకుండానే సినిమాకు



విపరీతంగా హైప్ తీసుకొచ్చిన రాజమౌళి.. ఇప్పుడు ఏ అప్‌డేట్ లేకుండానే డైరెక్ట్‌గా కంటెంట్ మీడియాకు వదిలేస్తున్నారు. ఇందులో విలన్‌గా నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ అందుకు ఉదాహరణ. ఆ లుక్ వచ్చేవరకు అది వస్తుందన్న సమాచారం కూడా లేదు. సోమవారం 'సంచారి' అనే పాటను విడుదల చేశారు. దీనిపై కూడా ముందస్తు సమాచారం ఏమీ లేదు. డైరెక్ట్ రిలీజ్ చేసేశారు. ఆ పాట వస్తుందని సినిమా సర్కిల్స్‌లోనే చాలా మందికి తెలీదు. ముందుగా పాట యాపిల్ మ్యూజిక్‌లో స్ట్రీమ్ అయింది, తర్వాత యూట్యూబ్‌లో దర్శనమిచ్చింది. కాకపోతే రిలీజ్ అయిన తర్వాత రావాల్సిన రీచ్ ఇప్పటికే వచ్చేసింది. మామూలుగా ఇలాంటి పాట వస్తుందంటే ఫస్ట్ సింగిల్ వస్తుందని, లేదా ఇంకేదో అప్‌డేట్ ఇస్తామని పోస్టర్ రూపంలో ముందుగా సమాచారం ఇస్తారు. ఏ సమయానికి వస్తుందో సమయం కూడా చెబుతారు. ఈ మధ్యన భారీ బ్జడెట్ చిత్రాలన్నీ చేసే పని ఇదే. కానీ రాజమౌళి తీరు చూస్తుంటే ఆ పాత పద్ధతికి స్వస్తి చెప్పినట్లు అర్థమవుతుంది. ఈ సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి కొత్త పద్ధతి ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది.





# ఫిక్షనల్ క్రైమ్ డ్రామా కాంత



మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ కాంత. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. రానా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది దుల్కర్ సల్మాన్ టీం. కాంతను ముందుగా లక్కీభాస్కర్‌తోపాటు షూట్ చేయాలనుకున్నాం. ఫస్ట్ లుక్ టెస్ట్ పూర్తి

చేసినప్పుడు ఇద్దరు డైరెక్టర్లు అక్కడే ఉన్నారు. ఇద్దరు డైరెక్టర్ల టీమ్స్ కూడా రెండు లుక్స్‌లో ఉన్న కామన్ థింగ్‌ను కనుగొనేందుకు ప్రయత్నించాయి. కాంతలో 80స్ పీరియాడిక్ లుక్‌లో మారిపోవాల్సి ఉంటుంది. మీరు ఈ రెండు లుక్స్ కూడా సరిపోల్చుకోవచ్చు. కాంతలో క్లీన్ షేవ్ లుక్‌లో కనిపించాల్సి రావడంతో అది సాధ్యం కాలేదు. కాంత ప్రొడక్షన్స్ పనుల్లో ఆలస్యం కూడా దీనికి ఒక కారణమంటూ చెప్పుకొచ్చాడు దుల్కర్ సల్మాన్. ఇండియన్ యాక్టర్, సినిమాటిక్ సింగర్‌గా పాపులర్ అయిన ఎంకే త్యాగరాజ భగవతార్ ప్రయాణం స్ఫూర్తిగా సాగే ఫిక్షనల్ క్రైం డ్రామా అని అన్నాడు దుల్కర్ సల్మాన్. అంతేకాదు కాంత సాధారణ పీరియాడిక్ డ్రామా కాదని.. మోడ్రన్ సినిమా చూసిన అనుభూతిని ఇస్తుందని చెప్పారు రానా, దుల్కర్ సల్మాన్. ఇప్పటికే కాంత మూవీ నుంచి చేసిన అమ్మాడివే సాంగ్, రేజ్ ఆఫ్ కాంత ట్రాక్ సినిమాలపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## బ్యాడ్ గర్ల్ చూడదగ్గ మూవీ : శోభిత

ఇండస్ట్రీలో వివాదాస్పదమైన సినిమాలు చాలానే ఉన్నాయి. బ్యాడ్ గర్ల్ చిత్రంపై అక్కినేని కోడలు శోభితా ప్రశంసలు కురిపించింది. ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట వైరల్ గా మారింది. అక్కినేని కోడలిని అంతగా మెప్పించిన సినిమా ఏది అంటే.. బ్యాడ్ గర్ల్ అంజలి శివరామన్ ప్రధాన పాత్రలో వర్ష భరత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం బ్యాడ్ గర్ల్. వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్ నిర్మించిన ఈ సినిమా టీజర్ రిలీజ్ అయినప్పటి నుంచే వివాదాలను




ఎదుర్కొంటుంది. ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన అమ్మాయి.. తన యుక్త వయస్సులని లైంగిక కోరికల గురించి చెప్పడం, వాటిని తీర్చుకోవడానికి తహతహలాడడం లాంటివి చూపించడంతో బ్రాహ్మణ సంఘాలు మండిపడ్డాయి. ఈ సినిమాను బ్యాన్ చేయాలనీ డిమాండ్ చేశాయి. ఇక బ్యాడ్ గర్ల్ సినిమా సెప్టెంబర్ లో రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. వివాదం వలన ఎక్కువ పేరు తెచ్చుకోలేకపోయిన ఈ సినిమా ఈ నెల నుంచే జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది. సినిమా బావున్నా కూడా వివాదం అవుతుందేమో అన్న భయంతో ఎవరు కూడా ఈ చిప్తం÷–రపై స్పందించలేదు. తాజాగా అక్కినేని కోడలు శోభితా మాత్రం బ్యాడ్ గర్ల్ చిత్రం తనకు బాగా నచ్చిందని పోస్ట్ పెట్టింది.'బ్యాడ్ గర్ల్.. నన్ను నవ్వించింది.. కన్నీళ్లు పెట్టించింది. మంచి సినిమా చూసిన అనుభూతిని అందించింది. అందరూ చూడాల్సిన సినిమా.. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ చిత్రాన్ని నేను సిఫార్సు చేస్తున్నాను. ఇది మనకోసం.. వర్ష భరత్ మరియు అంజలి శివరామన్ ను అభినందించాలి' అంటూ చెప్పుకొచ్చింది. దీంతో ఒక్కసారిగా ఈ సినిమాపై ఎక్కడలేని హైప్ వచ్చేసింది. మరి అక్కినేని కోడలి పోస్ట్ వలన ఈ సినిమా రాత మారుతుందేమో చూడాలి.



## పెద్దిలో రహ్మాన్‌తో జానీ మాస్టర్

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఇటీవల ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్‌తో కలిసి ఒక ఫొటో దిగిన విషయం తెలిసిందే. ఈ ఫొటోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు జానీ. రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ ఘటన జరిగింది. అయితే జానీ ఈ ఫొటోను పంచుకున్న వెంటనే కొంతమంది నెటిజన్లు లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తితో కలిసి ఫోటో దిగడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రెహమాన్‌ని తప్పుబట్టడమే కాకుండా జానీ మాస్టర్‌పై విమర్శలు గుప్పించారు. దీనికి సంబంధించిన వివాదం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే జానీ మాస్టర్ వివాదం విషయం రెహమాన్‌కి తెలియదని అందుకే అతనితో కలిసి దిగి ఉంటాడని పలువురు ఆరోపిస్తున్నారు. సింగర్ చిన్మయ్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. రెహమాన్ సర్‌కి ఈ వివాదం గురించి తెలియదు. తెలిసి ఉంటే అతడితో కలిసి దిగి ఉండకపోవచ్చంటూ చిన్మయి తెలిపింది. మరోవైపు లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని మళ్లీ సినిమాల్లోకి ఎలా తీసుకున్నారంటూ చిత్రబృందం ప్రశ్నిస్తున్నారు నెటిజన్లు.





## డింపుల్ హయతికి కలసి వచ్చేనా?

సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'గల్ఫ్'మూవీతో నాయికగా తెరంగేట్రమ్ చేసిన డింపుల్ హయతీ ఈ మధ్య కాలంలో తన నటనకంటే వివాదాస్పద అంశాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచింది. 2023లో ఓ పోలీస్ ఆఫీసర్ తో తగవు పడిన విషయంలోనూ, కొద్ది నెలల క్రితం ఇంటి పనమ్మాయి ఇచ్చిన ఫిర్యాదుతోనూ డింపుల్ హయతీ, ఆమె భర్త విక్టర్ డేవిడ్ మీడియాలో కెక్కారు. తెలుగులో రెండేళ్ళ క్రితం గోపీచంద్ 'రామబాణం'సినిమాలో చివరిగా నటించిన డింపుల్ హయతీకి ఆ తర్వాత మరే సినిమాలోనూ ఛాన్స్ దక్కలేదు. అయితే తాజాగా మాస్ మహరాజా రవితేజ నటిస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' లో

ఆమె హీరోయిన్ గా నటిస్తోంది. డింపుల్ హయతీతో పాటు ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ మరో హీరోయిన్. విశేషం ఏమంటే ఆషికా రంగనాథ్... రవితేజ సరసన నటించడం ఇదే మొదటిసారి కానీ డింపుల్ హయతీ గతంలో రవితేజతో 'ఖిలాడీ' మూవీలో నటించింది. ఆ సినిమాలో తన గ్లామర్ తో, డాన్స్ తో డింపుల్ ఆడియెన్స్‌ను మెప్పించినా... సినిమా మాత్రం కమర్షియల్ గా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత వచ్చిన 'రామబాణం' కూడా నిరాశకే గురిచేసింది. దాంతో ఇప్పుడు అమ్మడి ఆశలన్నీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా మీదనే ఉన్నాయి. సంక్రాంతి కానుకగా రాబోతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ఒక వేళ హిట్ అయితే... డింపుల్ హయతీ మళ్ళీ ట్రాక్ లోకి వచ్చే ఆస్కారం ఉంటుంది. మరికొన్ని అవకాశాలు లభించి, కెరీర్ ఇంకొంతకాలంగా సాఫీగా సాగిపోతోంది. లేకపోతే ఇక కష్టమే. ఎందుకంటే... గడిచిన ఏడెనిమిదేళ్ళలో డింపుల్ తెలుగుతో పాటు తమిళ, హిందీ చిత్రాల్లో నటించింది. బట్ ఎందుకో అక్కడ కూడా తనదైన మార్క్ చూపించలేక పోయింది. సో... 'భక్త మహాశయులకు విజ్ఞప్తి' మూవీ డింపుల్ కెరీర్ కు లిట్మస్ టెస్ట్ అనుకోవాల్సి ఉంటుంది.



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154